

# మెహెర్‌బాబా

## అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి: 25 సంచిక: 11 హైదరాబాద్ 2026 ఫిబ్రవరి పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-

మెహెరాబాద్‌లో

# 57వ అమరతిథి వేడుకలు

చిత్రమాలిక. వార్తా వ్యాఖ్య పేజి 6-16





## బాబా సందేశం

**'సేవ అంటే ఏమిటి? నిరుపేదలకు సాయపడటం.**
కష్టాల్లో వున్న వాళ్ళని ఆదుకోవడం. కావల్సిన వారికి చేయూతనివ్వటం.
సేవ చేయటానికి వాళ్ళు మనకో సదవకాశం కల్పిస్తున్నారని గుర్తుంచుకోండి.
అందుకనే సేవ చేయించుకున్న వాళ్ళకి మనం రుణపడి వుండాలి.
ఏ మాత్రం ప్రతిఫలాన్ని ఆశించకుండా, నిస్వార్థంగా సహాయపడాలి.

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**శ్రీ దశిక ప్రసాదరావు**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. 57వ అమరతిథి వేడుకలు 6-16
3. మెహెర్ కృప 17
4. సమాధిపై పూల వర్షం 18-19
5. లార్డ్ మెహెర్ 20-23
6. ఏడు విశిష్టత 23
7. సృష్ట్యాదిలో ఏం జరిగింది? 24-26
8. అవతారుని దివ్యత్వం 27-28
9. చర్చా గోష్ఠి 29-30
10. మెహెరీశం పార్ట్ - 2 31
11. సేవ అంటే ఏమిటి 32-33
12. మా మాటలు 34
13. మణిజా ఆత్మకథ 35
14. లక్ష్మణ్ పవార్ 36
15. ప్రార్థనలు 37-38
16. చిత్రమాల 39
17. జీవితసభ్యులు 40

ముఖ చిత్రం
**పుష్ప వృష్టి**
ఫోటో రూపకర్త: శ్రీ నాగేంద్ర గాంధీ, కాకినాడ
ప్రత్యేక వ్యాసం పేజి 18-19 లలో

# అమరతిథి వేడుకలు

## మెహెర్‌స్థాన్‌లో

అవతార్ మెహెర్‌బాబా 57వ అమరతిథి, కొవ్వూరు మెహెర్‌స్థాన్‌లో వైభవంగా నిర్వహించినట్లు శ్రీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా, శ్రీ కోడూరి ప్రసాద్ గారు బాబావారి సప్తవర్ణ పతాకాన్ని ఎగురవేశారు. పలు బాబా కేంద్రాల నుండి వచ్చిన బాబా ప్రేమికులు భజన గీతాలు ఆలాపించారు. శ్రీ సత్య కుమార్ (రాజమండ్రి), ఇంజనీర్ శ్రీనివాస్ (తణుకు), శ్రీమతి పద్మావతి (రాజమండ్రి) అవతారుని సందేశాల పై ప్రసంగించారు. మ. 12 గంటల నుండి 12 .15 వరకు మౌనం పాటించి, ప్రార్ధనలు, ఆరతి నిర్వహించినట్లు శ్రీ శ్రీనివాస్ తెలిపారు. రమారమిన 350 మంది బాబా ప్రేమికులు పాల్గొన్నారు.

## చల్లపల్లి సెంటర్

57వ బాబా అమరతిథి కార్యక్రమం స్థానిక బాబా కేంద్రంలో 2026 జనవరి 31న ఉదయం 09.30 గంటల నుండి 1.00 గంట వరకు నిర్వహించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. చల్లపల్లి సెంటర్ నందు ప్రతినెలా నిర్వహించే ఏకనామంలో భాగంగా 2026 జనవరి 4న శ్రీ చుండూరి కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించడమైంది. జనవరి 10వ తేదీన శ్రీ ఉడుతు రామారావు గారు బాబాలో ఐక్యమయ్యారు. ఈ సందర్భంగా బాబాను ప్రార్ధస్తూ కొన్ని నిముషాలు మౌనం పాటించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026 జనవరి – ఫిబ్రవరి నెలలో**

1. శ్రీమతి పట్నాల నూకా రత్నం రూ. 5000/-
2. శ్రీమతి పావని, విశాఖపట్నం రూ. 1000/-,
3. శ్రీ బి. క్రిష్ణయ్య, హైదరాబాద్ రూ. 1000/-,
4. శ్రీమతి కమలా రాణి, హైదరాబాద్ రూ. 500/-,
5. శ్రీ మోహన్‌రావు, హైదరాబాద్ రూ. 500/-,
6. శ్రీ గణపతిరావ్, హైదరాబాద్ రూ. 500/-,
7. శ్రీ పిండి నిరంజన్ బాబు రూ. 500/-
8. శ్రీమతి సునీత, బెంగళూరు రూ. 1000/- **పంపినారు.**

**వీరందరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా.**

సంపాదకీయం

# గురుతర బాధ్యత

**మెహెరీశుని అవతార వ్యక్తీకరణ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రేమిక లోకంపై వో** గురుతర బాధ్యత వుంది. అడపాదడపా మెహెరాబాద్‌ని సందర్శించడం, సమాధి దర్శన భాగ్యంతో పులకించి పోవడం, వారం వారం జరిగే సెంటరు కార్యక్రమాల్లోనూ, తరుచు నిర్వహిస్తున్న సహవాస్‌ల్లోనూ చురుకుగా పాల్గొనటం, వీలయినప్పుడిల్లా ఏకాహం, నామస్మరణ, నామ జపం మంచిదే. వీటన్నింటినీ మించిన మహత్తర కార్యక్రమం మరొకటుంది. అదే మెహెరుని సందేశం నేల నాలుగుచెరుగులా వ్యాపించడానికి నడుం కట్టడం.

**అమ్మో! ఇది మనవల్ల అవుతుందా? అవతారుడే చూసుకొంటారు, మనం నిమిత్తమాత్రులం** అంటారు కొందరు. ఇంకొందరు అంటారు కదా –ఈ పని ఎవరు చేయాలి? ఎలా చేయాలి? ఏ పరిధిలో నిర్వహించాలి? ఇలానే యింకా ఎన్నో ప్రశ్నలు. అయినా ప్రభువు పెట్టిన ట్రస్టు, ప్రభువు పేరిట వెలసిన సెంటర్లు వుండగా మనకెందుకీ శ్రమ అనేవారు లేకపోలేదు.

**ఆధ్యాత్మిక మార్గంలో ఎవరి ప్రయాణం వారిదే. ఎవరు, ఎప్పటికి గమ్యం చేర్తారో వాళ్ళ** సంస్కారాలని బట్టి వుంటుంది. అవతారుని కరుణ తోడయితే ముందడుగుపడ్తుంది. ఏదో వొక రోజుకి ఆత్మ జ్ఞానం సిద్ధిస్తుంది. ఈ మాటనీ బాబావారే శెలవిచ్చారు. అలా అని ప్రేమికలోకాన్ని చేతులు ముడుచు కూర్చోమని చెప్పలేదు. ఎప్పుడో 1920 ప్రాంతం లోనే అంటే మంజిల్–ఇ–మీమ్ రోజుల్లోనే ప్రభువు దిశా నిర్దేశం చేశారు. సమాధి ద్వారం పైనా కన్పిస్తుంది ఆ సందేశం "మాస్టరీ ఇన్ సర్విట్యూడ్", సేవలో పరమార్ధం. బాబావారి మతం – ప్రేమ. కులాలు, వర్గాలూ, వర్ణాలకి అతీతమైనదీ ప్రేమ. గత యుగాలలో భక్తిగా చెలామణి అయినది ఈ ప్రేమ. అయితే అప్పట్లో పూజారి వ్యవస్థకి బలి అయి, క్రతువుల్లో, కర్మకాండల్లో మునిగితేలింది.

**ఆ గతానికి గుడ్ బై చెప్పండి. వినయంతో, చిత్తశుద్ధితో కదిలి రండి అన్నారు మెహెరుడు.** ఈ దిశగా మేల్కొల్పడానికి వచ్చామని అవతారుడు చాలాసార్లు చెప్పారు. ఉడతా శక్తి మన ప్రయత్నం చేయాలి. మెహెరుని సందేశం నలుగురికి వినిపించాలీ అంటే, బాబావారు చూపిన బాటనే నడవడం అవసరం. ఈ బాటలో మనందరికీ శ్రీరామ రక్ష – నిరాడంబరత, సుహృద్భావం, త్రికరణశుద్ధి. అలనాటి కె.డి.ఆర్.ఎమ్.ల లాగా కాకుండా, సఖ్యతతో నలుగురూ కలిసి మెలిసి అడుగులు వేస్తేనే బాబావారు అప్పగించిన గురుతర బాధ్యతని అవలీలగా భుజాన వేసుకో గలుగుతాము. స్వంత ధగధగలకి స్వస్తి చెప్పాలి. లేదూ, మనం కె జె దస్తూర్‌ల మవుతాం!

***

# 57వ అమరతిథి వేడుకలు

అవతారుని 57వ అమరతిథి వేడుకలు వైభవంగా జరిగాయి. ట్రస్టు చైర్మన్ విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ స్వాగతం పలికారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రేమికులకు బాబా ట్రస్టు డి – హాస్టల్, యం.పి.ఆర్, న్యూ సైట్, న్యూ న్యూసైట్‌లలో బస ఏర్పాటు చేసింది. సుమారు 11 వేల మందికి పైగా ఈ హాస్టల్సులో బస చేశారు. ఇవికాకుండా ఆంధ్రా రెస్టు హౌసులో, మరి పలు ఇతర ప్రాంతాల్లో కూడా ప్రేమికులు బస చేశారు. జనవరి 30వ తేదీ ఉదయాన్నే గుజరాతీ ప్రభుస్తుతి, పశ్చాత్తాప పార్ధన, భూజావే ఆరతితో మొదలయిన మూడు రోజుల కార్యక్రమం, ఫిబ్రవరి ఒకటి మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పర్షియన్ భాషలో ప్రభు గుణ గానంతో పరిసమాప్తమైంది.

## దర్శనార్థులు

2026 జనవరి 30న బాబావారి దర్శనానికి ఎప్పటిలా టోకెన్లు ఇచ్చారు. జనవరి 30 అర్థరాత్రి 12 నుండి జనవరి 31 సాయంత్రం దాకా మొత్తం 33వ నంబరు టోకెను ఇచ్చారు. ఒక్కొక్క టోకెన్ నంబర్‌పై 500 మంది దర్శించుకునే వీలుంది. వయస్సురీత్యా పెద్దవారిని, అనారోగ్యంతో బాధపడేవారిని మాత్రం తక్కువగా వున్న క్యూలో నుండి దర్శనానికి పంపారు. గత ఏడాదిల్లో మాదిరిగానే బాబా సమాధి లోపల పవిత్ర పాలరాయికి


దర్శనం కోసం




ఎదురుగా చెక్క రెయిలింగ్‌ను ఏర్పాటు చేసి బాబా దర్శనాన్ని వేగవంతం చేశారు. ఐతే, ఈ రెయిలింగ్‌ను ఫిబ్రవరి 2 తర్వాత తీసివేసి అవతారుడ్ని నేరుగా దర్శించుకునే వీలు కల్పించారు. ఈ దఫా అమరతిథిలో స్థానిక గ్రామీణులు, మహిళలు, ఎందరో యువత ముఖ్యంగా తెలంగాణ ప్రాంతం నుండి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనేక బాబా కేంద్రాల నుండి వాలంటీర్లు నిరుపమానమైన సేవలందించారు.

## ప్రార్థనలు – ఆరతి

జనవరి 30 నుండి వరుసగా ప్రతి రోజూ అమరతిథి వేదికపై ప్రార్థనలు చదివారు. తెలుగు, మరాఠీ, పరిష్యన్, ఉర్దూ, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో ప్రభుస్తుతి, పశ్చాత్తాప ప్రార్థన చేసి, ఆరతి పట్టారు. ఈ వివిధ భాషా ప్రార్థనలు వొక్కసారి కాకుండా మూడు రోజుల్లో వివిధ వేళల్లో జరిగాయి. ఆయా భాషల వారికి ఆనందం, సంతృప్తి కలిగించాయి.

## సాంస్కృతిక కార్యక్రమాలలో సుమారు 3 వేల మంది

అలాగే, ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా రమారమిన మూడు వేలమంది బాబా ప్రేమికులు అవతారుని సందేశాలపై భజన గీతాలు, నృత్యాలు, లఘు నాటికలలో పాల్గొన్నారు. ఉర్దూ కవ్వాలీలు – ఘజల్సు కూడా చోటు చేసుకున్నాయి. భజన గీతాలు, నృత్య ప్రదర్శన కోసం 5 నిముషాలు చొప్పున సమయం కేటాయించారు. నాలుగైదు సంవత్సరాల చిన్నారుల నుండి అరవై – డెబ్భై వసంతాలు నిండినవారి దాకా, అన్ని




వయస్సుల వారు ఎంతో ఆనందంగా, ప్రభు నామ ఝురిలో తేలిపోతూ ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఏతావాతా, అమరతిథి మూడ్రోజుల వేడుకలలో మూడు వందల బృందాలు తమ ప్రదర్శన ఇచ్చాయి. ఒక్కొక్క బృందంలో 10 మంది నుండి 50 మంది దాకా వున్నారు. ఇది అవతారుడు తమకు అందించిన అరుదైన అవకాశంగా వారు భావించారు. శ్రీ మలకపల్లి పన్నగేశ్వరరావు, సికింద్రాబాద్ 'నీ నిజ దర్శనం' పేరిట కవిత వినిపించారు. శ్రీ కొక్కొండ రాంచందర్, రామాయంపేట బృందం, శ్రీమతి వి. సుశీల, మెహెరాబాద్ బృందావనం మహిళా బృందం, శ్రీమతి పద్మావతి, శ్రీమతి కె.నాగలక్ష్మి, శ్రీ ఆనంద్‌కుమార్ బృందం శ్రీకాకుళం, అలాగే శివ కుమార్, హిందూపురం, శ్రీ గోపి బృందం కదిరి, ఇంకా మరికొందరు తమ గాన లహరితో, మెహెరు నామ సంకీర్తన అందర్నీ అలరించింది. ఈ కార్యక్రమాలన్నింటినీ వెబ్‌కాస్ట్ చేశారు. వెబెకాస్ట్ బాగా ఆకొట్టుకొంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 12 వేలమందికి పైగా యూ ట్యూబ్‌లో అమరతిథి వేడుకల్ని తిలకించారు. ఫిబ్రవరి 1 తేది మధ్యాహ్నం ట్రస్టీ శ్రీ గోపాలకృష్ణ బృందం ఆలాపించిన **బాబా హూ** (బాబా దేవుడు ఆలాపన) అహుతుల్ని తన్మయుల్ని చేసింది. యువత లేచి కేరింతలు కొట్టారు. మరోమారు ఆ గానాన్ని వినిపించాలని కోరారు. ఆర్కెస్ట్రాతో కలిపి సుమారు 50 మందికి పైగానే ఈ గీతాన్ని ముక్తకంఠంతో ఆలాపించారు.





# మెహెర్‌స్థాన్ వైభవం - నృత్య నాటిక



మెహెర్‌స్థాన్ వైభవం పేరిట నృత్య నాటిక ప్రదర్శన ఆహుతులైన బాబా ప్రేమికులను ఆకట్టుకుంది. శ్రీ కోడూరి కృష్ణారావ్ కొవ్వూరులో పావన గోదావరి నదీ తీరాన మెహెర్‌స్థాన్ నిర్మాణం చేపట్టడం, కాంశ్య విగ్రహ ఏర్పాటు, 1963 ఫిబ్రవరి 28న మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవం వేడుక సందర్భంగా అవతారుడు ఇచ్చిన ఎనిమిది సందేశాల వివరణ ఈ నృత్యనాటికలో ప్రధానాంశాలు. ఈ నాటికకు శ్రీ నాగేంద్ర గాంధీ, కాకినాడ దర్శకత్వం వహించారు. మెహెర్‌బాబా పాత్రను శ్రీ హరి మెహెర్ అభినయించారు.

**"ప్రేమకు పెన్నిధిగా, పరమాత్మకు సన్నిధిగా,**

**వెలసిన క్షేత్రమిది, ఆనందపు నిలయమిది, దివ్యస్థానం - మెహెర్‌స్థాన్ అని**

శ్రీ ఎస్. నోని మెహెర్వాన్ అభినయం, కుమారి ఎస్. మెహెర్ మణిజా, శ్రీకాకుళం సాంప్రదాయ నృత్య ప్రదర్శన ఆహుతుల్ని అలరించింది. మణిజా నృత్యం, అభినయం రమణీయంగా వున్నాయి. కాగా, శ్రీ వి. కామేశ్వరరావు నృత్య రూపకల్పన, శ్రీ మెహెర్ దాస్, శ్రీకాకుళం గీత రచన చేశారు.

## మరో రెండు లఘు నాటికలు

ప్రముఖ 'గజల్ గంధర్వ' శ్రీమతి బేగం అక్తర్ అవతారుడ్ని ప్రేమించి ఆరాధించిన వైనాన్ని చక్కని లఘు నాటికలో ప్రదర్శించారు.

**దేర్ ఈజ్ ఎ హోల్ ఇన్ ది బకెట్ పేరిట** ఇంగ్లీషు హాస్య నాటికను శ్రీమతి ధేరం శైలజ బృందం ప్రదర్శించారు. 1968 డిసెంబరు 28న మెహెరాజాద్‌లో ఈ నాటికను బాబావారి సోదరుని కుమారులు అవతారుని ఎదుట ప్రదర్శించారు. ఈ నాటిక చూసి బాబా నవ్వు ఆపుకోలేకపోయారని, తిరిగి అమరతిథి యాత్రీకుల కోసం తాము ప్రదర్శిస్తున్నామని




శ్రీమతి ధేరం అన్నారు. చిల్లు పడ్డ ప్లాస్టిక్ బక్కెట్‌కి మాటు వేయాలి. అందుకు అనేక మార్గాలు అన్వేషించారు. చివరిగా అందుకు నీళ్ళు కావాలంటే, మళ్ళీ ఆ బక్కెట్టే శరణ్యమయింది. ఐతే, బక్కెట్ ఏమో చిల్లు దాయె? ఎలా? అని నవ్వులతో ముగుస్తుంది

## ఫోటో ఎగ్జిబిషన్

అమరతిథి సందర్భంగా ఎగువ మెహెరాబాద్‌లో అవతారుని ఫోటో ఎగ్జిబిషన్, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా, 1920వ దశకంలో మెహెరాబాద్‌లో నిర్వహించిన పలు భవనాల నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకర్షించింది. సుమారు నూరు సంవత్సరాల క్రితం మెహెరాబాద్‌లో నిర్వహించిన హజ్రత్ బాబాజాన్ స్కూలు, ఆనాటి పోస్టాఫీసు భవనం, ఉపాసనీ సత్రం, వంటి భవనాలు నేడు అక్కడ లేవు. ఆనాడు అవతారుడు నిర్వహించిన కార్యక్రమాలను గుర్తుచేసుకునేలా, ఆనాటి భవనాల నిర్మాణాల నమూనాల ప్రదర్శన చక్కగా వుంది. బాబా ఏకాంతవాసం చేసిన గదిలో ఉన్న అంబులెన్స్ స్ట్రెచర్‌ను దర్శించుకునేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాటు చాలా సౌకర్యవంతంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వాహనాల పార్కింగ్

గతంలో మాదిరిగానే, దిగువ మెహెరాబాద్‌లో వున్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఐతే, ఈ విధానంలో ట్రస్టు వారు ఏర్పాటు చేసిన ఆటో రిక్షాలు వయస్సురీత్యా పెద్దవారికి అనేక ఇబ్బందులు కలిగించాయి. కాబట్టి ఆరోగ్య కారణాలతో బాధపడేవారిని ఎగువ మెహెరాబాద్‌లో డ్రాప్ చేశాక వారి వాహనాలను నిర్దేశిత ప్రాంతంలో పార్కింగ్ చేయమ నడం సబబు అని పలువురి అభిప్రాయం. మరో

విశేషం ఏమంటే, న్యూ న్యూ సైట్ నుండి న్యూ సైట్ వరకూ యాత్రీకుల రవాణా కోసం ప్రత్యేక బస్ ఏర్పాటు చేశారు. అలాగే, ఎగువ మెహెరాబాద్‌లో వున్న భోజన, ఫలహార క్యాంటీన్‌ల వరకూ వెళ్ళి రావడానికి వయోధికుల కోసం ప్రత్యేకంగా బ్యాటరీతో నడిచే ఆటోలను ఏర్పాటు చేశారు.




## క్లోక్ రూం

యాత్రీకులు తమ వెంట తెచ్చిన సామాన్లు దర్శన సమయంలో ఇబ్బంది కల్గించని రీతిలో దిగువ మెహెరాబాద్‌లో రైలు పట్టాలకు ఆవలగా ప్రత్యేకంగా ఒక క్లోక్ రూంని గత ఏడాది మాదిరి తాత్కాలిక ఏర్పాటు చేసారు. ఈ సౌకర్యం చాలామందికి అక్కరకొచ్చింది.

## ఆంధ్రా క్యాంటీను

అమరతిథి వేదిక వెనుక వున్న విశాలమైన ఖాళీ జాగాలో ఆంధ్రా క్యాంటీన్ విశేష సేవలు అందజేసింది. ఇదికాకుండా, శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, మచిలీపట్నం, పరేల్ సెంటర్ తరపున న్యూసైట్‌లో ఉచిత భోజన, ఫలహారాలను అమరతిథి వేడుకులకు హాజరైన ప్రేమికుల కోసం ఏర్పాటు చేశారు. వేలాదిమంది ప్రేమికులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని శ్రీ ఆర్.ఎన్. మూర్తి తెలిపారు. **న్యూ సైట్, న్యూ న్యూ సైట్, అలాగే దిగువ** మెహెరాబాద్‌లోని ఎ.బి.సి.డి హాస్టల్సు తదితర అన్ని వసతుల ఏర్పాట్ల వద్ద గట్టి సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. వాలంటీర్లుగా వచ్చిన పలువురు ప్రేమికులు ఈ పనిని ఎంతో శ్రద్ధ, క్రమశిక్షణతో నిర్వహించారు.


న్యూ సైట్ సెక్యూరిటీలో శ్రీ కొల్లి

## లఘు ఉపన్యాసాలు - ప్రెజెంటేషన్లు

జనవరి 30, 31 తేదీలలో అవతారుని సందేశాలపై తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో లఘు ఉపన్యాసాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం


लोकमत
हॅलो अहिल्यानगर

मेहेरप्रेमींनी पाळले मौ
भाविकांची मोठी गर्दी

వక్తలకు సుమారు 7 నిముషాల సమయం కేటాయించారు. ట్రస్టీ మెహెర్‌నాథ్ కల్చూరి, శ్రీ గోకర్ణం శ్రీవాత్సవ, తెలుగులో శ్రీ బి. రామక్రిష్ణయ్య ప్రసంగించారు. “అవతారుని లీల– దైవీ క్రీడ” అనే అంశంపై శ్రీ రామక్రిష్ణయ్య ప్రసంగించారు. ఈ ప్రసంగ పాఠవాన్ని ఈ సంచికలోని పేజి 24లో ప్రచురించడమైంది. భజన గీతాలు, నృత్యరీతులతో పాటు ఈ మాదిరి లఘు ప్రసంగాలు అర్థవంతంగా వున్నాయి. అలాగే, కార్యక్రమం మధ్య మధ్యలో బాబా సందేశాలను కూడా చదివి వినిపించారు శ్రీ బాలగోపాల మెహెర్ ఈశా.

## ప్రత్యేక చలన చిత్రం

జనవరి 30, 31 తేదీలలో అవతారుని జీవితం – సందేశాలపై 40 నిముషాలు నిడివి గల ప్రత్యేక చలన చిత్రాన్ని రెండు విడతలలో ప్రదర్శించారు. అవతారుడు చేపట్టిన మౌనం, మస్తుల సాంగత్యం, నవజీవనం, మనోనాశ్, ఏకాంతవాసం తదితర అంశాలపై క్షుణ్ణంగా ఈ చిత్రాలలో ప్రదర్శించారు. అవతారుని సమగ్ర జీవిత చరిత్రను ప్రదర్శించేలా ఈ చిత్రాలను రూపొందించారు. ఇది అమరతిథి ప్రత్యేకతగా చెప్పాలి.

## అంతటా నిశ్శబ్దం

అన్నింటికంటే మిన్నగా, 2025 డిసెంబరు నుండి జరుగుతున్న అమరతిథి విస్తృత ఏర్పాట్లు నిర్ణీత సమయానికంటే ముందుగా అంటే 2026 జనవరి 29 నాటికే పూర్తయినాయి. వేలాదిమంది తరలి వస్తున్న ఈ దైవ కార్యానికి, వందలాది మంది కార్మికులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఐతే, ఈ పనులన్నీ మౌనంగా, నిశ్శబ్దంగా జరిగాయి. సాధారణంగా నలుగురు కలిస్తే కనిపించే హడావిడి లేదు. అరుపులు – కేకలు లేవు. **నిశ్శబ్ద, ప్రశాంత వాతావరణం మెహెరాబాద్‌కే ప్రత్యేకం.**

***

# 57వ అమరతిథి ప్రత్యేకతలు



ప్రథమ అమరతిథి వేదికపై మెహెర్మామాయి

- వయోధికులైన యాత్రీకులకు చక్కని రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు.
- ట్రస్టు నిర్వహిస్తున్న హాస్టల్సుల్లో యాత్రీకుల కోసం సుమారు 11 వేల పరుపులు ఉచితంగా అందజేశారు.
- సి, డి హాస్టల్సులో యాత్రీకుల ప్రవేశంకు సంబంధించి క్యూ ఆర్ కోడ్‌ని ప్రయోగాత్మకంగా వినియోగించారు. దీని ద్వారా ఎంతమంది, ఏ సమయంలో హాస్టల్ లోనికి వెళ్ళారు. ఏ టైంకి బైటకు వచ్చారో తెలుస్తుంది.
- వాలంటీర్లందరికీ ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఈ ఏర్పాటు ఎంతో వెసులుబాటు కలిగించింది.
- ఇకపై మెహెరాబాద్‌కి ఏడాది పొడవునా వాలంటీర్లకు ట్రస్టు ఆహ్వానం పలుకుతోంది. మెహెరాబాద్‌లో సేవ చేయాలనుకునేవారు తమ అభ్యర్థనను ట్రస్టుకు తెలియజేస్తే, తగిన ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు.
- మెహెరాబాద్‌లో రమారమిన 50 వేల చెట్లు వున్నాయి. వాటి పోషణ, పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.
- మెహెరాబాద్ పరిశుభ్రతకు పెట్టింది పేరు. ఐతే, పెరుగుతున్న యాత్రీకుల సంఖ్య దృష్ట్యా, పబ్లిక్ హెల్త్‌కు ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నామన్నారు.
- **అమరతిథిలో వేలాదిమందికి భోజన, ఫలహారాలు ఏర్పాటు చేసినా, అపరిశుభ్రత ఏమాత్రం కాన రాలేదు. ఈగలు – దోముల రొద వినపడక పోవడం గమనార్హం!**

***

- **లఘు ఉపన్యాసాలు – ప్రెజెంటేషన్లు.** జనవరి 30, 31 తేదీలలో అవతారుని సందేశాలపై తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో లఘు ఉపన్యాసాలను ఏర్పాటు చేశారు.
- జనవరి 30, 31 తేదీలలో అవతారుని జీవితం – సందేశాలపై 40 నిముషాలు నిడివి గల ప్రత్యేక చలనచిత్రాన్ని రెండు విడతలలో ప్రదర్శించారు. *

# 57వ అమరతిథిలో, ట్రస్టు చైర్మన్ శ్రీ ఫలూ మిస్త్రీ స్వాగతోపన్యాసం



**అమరతిథికి కొత్త నిర్వచనం యిచ్చారు ట్రస్టు** చైర్మన్ ఫలూ మిస్త్రీ. మెహెరీశుని ప్రేమికులకు అమరతిథి పవిత్ర సంగమ స్థానం అన్నారు. ప్రియతముని సాహచర్యంలో గడిపే రోజు. ప్రభువు అభిష్టాను సారం జీవించాలన్న నిర్ణయాన్ని దృఢతరం చేసుకొనే రోజు 'అమరతిథి' అన్నారు.

**57వ అమరతిథికి విచ్చేసిన అశేష ప్రేమికులకు** స్వాగతం చెప్పారు. చాలాకాలం క్రిందట జరిగిన సంఘటనను గుర్తు చేసుకోవడమే కాదు అమరతిథి. ప్రతి సంవత్సరం ఆత్మ చేసే యాత్ర యిది అన్నారు. మెహెరీశుని ప్రియతమునిగా స్వీకరించిన వారందరికీ దిశా నిర్దేశం లభిస్తుంటుంది ఆంతరంగికంగా అన్నారు. కనబడకుండానే మనతో నడుస్తుంటాడు మెహెరుడు. మన ప్రతి మాటనీ వింటాడు. మనం ఎప్పుడు తన వైపు తిరుగుతామా అని అనంత సహనంతో వేచి వున్నాడు యుగావతారుడు అని పేర్కొన్నారు.

**బాబా అభీష్టం ప్రకారం నడుచుకొనే ప్రయత్నం చేయండి. మెహెరీశుడు ఏమన్నాడో** తెలుసు కదా. మీరు నన్ను భగవంతుడిగా స్వీకరిస్తే, భగవంతుని మాటే మీ సర్వస్వం కావాలని శెలవిచ్చారు. అలానే తమ మాటని మనం హృదయపూర్వకంగా ఆచరించాలనీ హితవు పలికారు. ఇలా ఎప్పుడు ఎలా చేయగలమో కూడా ప్రభువు పేర్కొన్నారు. అహంకారానికి తిలోదకాలు యివ్వండి. వెంటనే ప్రేమపథంలో మీ ఆంతరంగిక ప్రయాణం మొదలవుతుందని మెహెరీశుడు చెప్పారు. **గుర్తుంది కదా మీకు అన్నారు చైర్మన్ మిస్త్రీ.**

**ఈ సందర్భంలో ఏరుచ్ అన్న మాట గుర్తుచేశారు. ఏమని అంటే, అహంకార మాయ వలలో** పడకూడదు సరికదా సముద్రమనే పరమాత్మలో మునిగిపోవాలి. ఇలా ఎప్పుడు వీలవు తుంది. అహంకారం సూక్ష్మాతి సూక్ష్మ స్థాయికి పడిపోవాలి. అప్పుడే మాయ అహంకారాన్ని పట్టుకోలేదు. ఎగదోయ లేదు సరికదా, మాయ అనే వల ఛిద్రాల నుంచి అహంకారం జారి పరమాత్మ సాగరంలో పడుతుం దని ఏరుచ్ అనేవారు. ఇది తప్పక



గుర్తుంచుకోవాల్సిన సంగతి అన్నారు మిస్త్రీ.

**ఈ సత్యాన్ని మెహెర్‌బాబా వారు 1958లోనే వెల్లడించారు. అప్పుడు సహవాస** కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆ కార్యక్రమ సమయంలో మెహెరాబాద్‌లో పెట్టండి అని కొన్ని సందేశాలు యిచ్చారు. వాటిని ఐదు భాషల్లో వ్రాయించారు. ఆనాటి సందేశాలు నిత్య స్మరణీయం నేటికీ అంటూ ట్రస్టు ఛైర్మన్ తమ స్వాగతోపన్యాసం ముగించారు. **భ్రాంతి మయ అహన్ని రూపుమాపే ప్రయత్నంలో దిశా నిర్దేశం చేస్తాయి ఈ సందేశాలు.**

1). నీవు ఎవ్వరినీ కోపగించకోకు- ఒక్క నీ బలహీనతను తప్ప
2) ఎవ్వరినీ ద్వేషించకు - నీ కామపూరిత అహాన్ని తప్ప
3) సహనము- న్యాయము అనే సంపదను అధికారికంగా స్వంతం చేసుకోనే దురాశ కలిగి ఉండు.
4) నీ ప్రలోభమంతా నా కృపను పొందడానికి, నీ ప్రేమతో నన్ను ప్రలోభపెట్టు
5) నీ కోరికలపైననే సమరాన్ని ప్రకటించు 6) దైవత్వమే నీవు పొందే విజయం.

**- మల్లాది రామారావు, మెహెరాబాద్**

# బాబా జన్మదినోత్సవాలు

**2026** ఫిబ్రవరి **25** తెలుగునాట గల బాబా కేంద్రాలలో జరుపుకున్న బాబా జన్మదినోత్సవ వేడుకలపై సంక్షిప్త నివేదికను ప్రచురణార్థం మార్చి 2వ తేదీలోగా పంపవల్సిందిగా కోరుతున్నాం. మీరు చేపట్టిన సేవా కార్యక్రమాల వివరాలకు తగిన ఫోటోలను జతపరచ వల్సిందిగా కోరుతున్నాము.

## చిరునామాలలో మార్పు వుంటే

**పోస్టలు రేట్లు పెరిగిన దృష్ట్యా, మీ చిరునామాలలో ఏదైనా మార్పువుంటే, తక్షణం తగిన మార్పుని వాట్సప్ నంబర్ 9959553218కి తెలియజేయగలరు.**

# ట్రస్టు చైర్మన్, శ్రీ ఫలూ మిస్త్రీ
# ముగింపు ఉపన్యాసం

**అమరతిథినాడు దివ్యానుభూతిలో మునిగి తేలుతున్న ప్రేమికులకి ఇంటి దారి పట్టాలంటే** మనస్సు వొప్పుకోదు. వెనక్కి వెనక్కి తిరిగిచూస్తూ, కట్టలు త్రెంచుకొంటున్న దుఖాన్ని దిగిమ్రింగే ప్రయత్నం చేస్తూ, మళ్ళీ ఎప్పటికో సమాధి దర్శనం అని  మధనపడుతూ గృహోన్ముఖులవుతారు.

**ట్రస్టు చైర్మన్ శ్రీ ఫలూ తమ వీడ్కోలు (2026 ఫిబ్రవరి 1వ తేదీ) ఉపన్యాసంలో** ఈ మాటే అన్నారు. మన అందరి మనోభావాలకీ అద్దం పట్టారు. “మెహెరాబాద్ కొండని వదిలి వెళ్ళటం అంత సులభం కాదు. అయినా తప్పదు కదా” అన్నారు. బాబా ప్రేమలో బాల్యం నుంచి మునిగి తేలుతున్న ఫలూ గారు  భౌతిక దూరం ప్రధానం కాదు అన్నారు. బాబా మన అందరి హృదయాల్లోనూ వున్నాడు. మన శ్వాస కన్నా దగ్గరగా వున్నాడు మెహెరుడు మనందరితో అన్నారు.

**మన ఆలోచనల్ని ప్రభువు కేసి తిప్పాలి. అప్పుడు విదితమవుతుంది. ప్రేమ మూర్తికి,** ప్రేమికునికి మధ్య దూరం లేదని అన్నారు. నిజమైన పెన్నిధి ఎక్కడో లేదు. మన హృదయాల్లోనే వుందన్నారు. మరి యిది మన కెప్పుడు తెలిసివస్తుంది. బాబా యిచ్చ ప్రకారం జీవించాలనే ప్రయత్నం నిజయితీగా, మనస్ఫూర్తిగా చేస్తే చాలు, ఆ పెన్నిధి దొరుకుతుంది అంటూ ఏరుచ్ అన్న మాటలు గుర్తుచేశారు.

**బట్టలు వేసుకొని తిరుగుతుంటే, అరే, బట్టలు వేసుకోలేదే అనిపించదు. అలానే మన** ఆత్మకి బాబా నామస్మరణ అనే దుస్తులు తొడిగితే, ఏ ముంది బాబా నీతోనే వుంటాడు ఎల్లప్పుడూ అన్నారుట ఏరుచ్.  ఈ మాట మన అందరికీ శిరోధార్యం కావాలన్నారు మిస్త్రీ. ఇంకోమాట అన్నారు. నిద్ర లేవగానే బాబా నామస్మరణ చేయాలి.

**నా ఆలోచనలు, నా  మాటలు, నా చేతలు  నీకర్పితం అనండి. అలానే** నిద్రపోయేముందు మెహెరుని గుర్తుచేసుకోండి. ఈవాల్టి నా దినచర్య, నీ కర్పితం ఈవేళ అనండి. ఇది చాలు మనకి అంటూ, ఈ మాట నాది కాదు ఏరుచ్ మహాశయుడు చెప్పాడు అన్నారు.

**“మూడు రోజుల అమరతిథిలో పొందిన పరిమళాన్ని మన వెంట తీసుకు వెడదాము.** ప్రియతమ బాబా మిమ్మల్ని నడిపించు గాక అంటూ ట్రస్టు ఛైర్మన్ ఫలూ మిస్త్రీ ముగించారు.



# మెహెర్ కృప పాల్వే

**నా పేరు మెహెర్ కృప వసంత పాల్వే. మా తండ్రి గారి** పేరు శ్రీ వి ఆర్ బడే. అడ్వకేట్. తల్లి ప్రొఫెసర్ సుశీలా బడే. అహమ్మద్‌నగర్ నుండి సుమారు 50 కిమీ దూరంలో వున్న పాథర్డీ మా స్వగ్రామం. మా నాన్న తొలిసారిగా 1950లో మహాబళేశ్వర్‌లో ఆఘాఖాన్ బంగళాలో బాబాని దర్శించుకున్నారు. మా అమ్మ – నాన్న ఇద్దరూ వాడియా పార్కు, అహమ్మద్‌నగర్‌లో బాబావారిచ్చిన ప్రజాదర్శన కార్యక్రమంలో వాలంటీర్లుగా పనిచేశారు. బాబా నామస్మరణతో రెండేళ్ళ క్రితం ఒకరి తర్వాత మరొకరు బాబాలో ఐక్యమయ్యారు. బాబాతో వారి అనుభవాలు గురించి చెప్పాలంటే అదొక పెద్ద గ్రంథమౌతుంది. 1962 నవంబరులో పూణే గురుప్రసాద్‌లో ప్రాక్–పశ్చిమ సమావేశాలలో బాబా దర్శన సమయంలో పసి పిల్లగా వున్న నన్ను బాబా పాదాల దగ్గర పడుకోబెట్టామని మా తల్లితండ్రులు చెప్తుండేవారు. ఆ సమయంలోనే బాబా నా పేరుని సూచించారని చెప్పారు.

**నేను బాబావారిని అహమ్మద్‌నగర్, మెహెరాబాద్, మెహెరాజాద్‌లలో పది, పన్నెండుసార్లకు** పైగా దర్శించుకున్నాను. మెహెర్‌బాబానే మా జీవితం. మా సర్వస్వం. బాబా మమ్మల్ని ఎంతగా ప్రేమించాడంటే, మేం ప్రేమించలేనంతగా మమ్మల్ని ఆయన దగ్గరికి తీసుకున్నాడు. మా జీవితాల్లో ప్రతి చిన్న విషయాన్ని ఆయన కనుసన్నలలోనే జరిగాయి. 1987 మే 7వ తేదీన, బాబా సమాధి చెంత మన్సారీమాయి, ఏరుచ్‌ల సమక్షంలో నా వివాహం వసంత్ విశ్వనాథ్ గారితో నిరాడంబరంగా జరిగింది. ఆయన తండ్రి, అంటే మా మామ గారు 11 సంవత్సరాల వయస్సులో టోకాలో బాబావారు నిర్వహిస్తున్న స్కూల్లో చదువుకున్నాడు.

**నేను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా రిటైరయ్యాను. నా భర్త నాబార్డ్‌లో** ఉన్నతాధికారిగా రిటైరయ్యారు. మా అమ్మాయి డాక్టరు. అమరతిథిలో వాలంటీర్‌గా వైద్యసేవలు అందిస్తోంది. ప్రస్తుతం, ముంబాయి దగ్గరున్న థానేలో స్థిరపడ్డామని, క్లుప్తంగా తమ గురించి చెప్పారు మెహెర్ కృప. శ్రీమతి మెహెర్ కృప చెప్పిన **“బాబా సమాధిపై పూల వృష్టి”** శీర్షిక ప్రక్కపేజీలో చూడండి!!

# పుష్ప వృష్టి

## మెహెర్ సాహిత్యంలో అముద్రిత అమూల్య సమాచారం



1969 ఫిబ్రవరి 7వ తేదీన బాబా సమాధిపై పూల వర్షం చూశాం. అవి పూలు అంటే పూలు కాదు. తళతళ మెరిసే నక్షత్రాల మాదిరి వున్నాయి. సమాధి పైభాగాన వున్న గుమ్మటాన్ని తాకి అదృశ్యమయ్యాయి. పట్టుకోబోతే చేతికి చిక్కని అపురూప రమణీయ దృశ్యం. నమ్మలేని నిజం. బాబా సన్నిధిలో పెరిగిన శ్రీమతి మెహెర్ కృప, ముంబాయి చెప్పిన మాటలివి.

**శ్రీమతి మెహెర్ కృపను ఇటీవల అమరతిథి** కార్యక్రమం ముగిశాక, 2026 ఫిబ్రవరి 3న మెహెర్‌బాబా ప్రతినిధి ఆమెని కలిసినప్పుడు చెప్పిన ఈ అరుదైన సమాచారం ఇకపై ఆమె మాటల్లో....

***

## మధ్యాహ్నం 12 గంటలు

**1969 జనవరి 31న బాబా భౌతిక దేహ** త్యాగం చేశారు. బాబావారి దేహాన్ని ముందు గానే మెహెరాబాద్‌లో నిర్మించిన భావి సమాధిలో ఫిబ్రవరి 7వ తేదీ వరకూ ఏడు రోజులపాటు, ప్రేమికుల దర్శనార్థం ఉంచారు. ఈ విషయం పాఠకులకు తెలిసిందే. ఫిబ్రవరి 7న మధ్యాహ్నం 12 గంటలకు బాబావారి సమాధిపై ప్రతిఒక్కరూ తమ పిడికిలితో ఎర్రని మృత్తిక చల్లారు. ఆనాడు మెహెరాబాద్‌కి విచ్చేసిన ప్రేమికులందరికీ ఈ అవకాశం ఇచ్చారు. సరిగ్గా ఈ సమయంలో అంటే, పిడికిలితో అవతారుని భౌతిక దేహంపై మృత్తిక చల్లే సమయంలో, బాబా సమాధి పైభాగాన వున్న గోపురంపై అందమైన రంగురంగుల భారీ పూల వాన కురిసింది. దీన్ని మా కనులారా చూశాం. అవి పూలంటే పూలు కాదు. తళతళా నక్షత్రాల్లా మెరిశాయి. ఆకాశం నుండి సమాధి గుమ్మటంపై వేగంగా పడి, మాయమయిపోయేవి.

మధ్యాహ్నం 12 గంటల సమయంలో వున్న సూర్యకాంతిలో కూడా, సమాధి పైభాగాన పడుతున్న ఆ నక్షత్రాల్లాంటి మెరుస్తున్న పూలను మా కనులారా చూశాం. ఇదంతా అవతారుడికి ప్రకృతి అందజేసిన ఘన నివాళి అని మాకు ఆ తర్వాత అర్థమయ్యింది. ఇదొక అద్భుత సుందర రమణీయ దృశ్యం. ఐతే ఈ దృశ్యాన్ని మండలి వారెవరూ చూడలేదు. ఆ సమయంలో పురుష మండలి అనేక పనుల్లో తలమునకలై ఉన్నారు. స్త్రీ మండలి దుఖం దిగమ్రింగుతూ ప్రభు నామస్మరణ చేస్తున్నారు.

**ఈ దృశ్యాన్ని తొలిసారిగా గమనించింది మా అమ్మ గారి స్నేహితురాలు. ఆనాడు ఆమె** మాతో పాటు తొలిసారిగా బాబా సమాధి దగ్గరకి వచ్చింది. ఆమెకి బాబా గురించి పెద్దగా తెలియదు కూడా. ఆమె పేరు బహేతి. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో వుంటున్నారట. ఈ సుందర రమణీయ దృశ్యాన్ని నా కనులారా నేను చూశాను. మా కుటుంబ సభ్యులందరూ చూశారు. అంతేకాదు. ఆనాడు, ఆ రోజు సమాధి ప్రాంగణంలో వున్న మాలాంటి వారు చాలామంది ఈ దృశ్యాన్ని తిలకించారని శ్రీమతి మెహెర్ కృప (77091-95174) అన్నారు. ఈ మాటలు గుర్తుచేసుకుంటుంటే, నాకు ఈవేళ్టికి కూడా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఆ జగద్రక్షకుని లీలలు చెప్పలవి కావు కదా!!

### 1926 జనవరి 9, శనివారం బాబా సమక్షంలో జరిగిన సంభాషణ

# పాథర్డీ లాయర్

**ఒకప్పుడు, లాయరుగా డబ్బు గడించాడు వో పెద్దమనిషి. పథరాడి పట్టణ నివాసి. నగర్‌కి** దగ్గరే ఈ వూరు. ఆధ్యాత్మిక చింతనలో పడి, యోగిగా మారాడు. బాబా దర్శనార్థం వచ్చాడు జనవరి తొమ్మిదిన. 'నా ధర్మ సందేహాలు తీరుస్తావా?' అని అడిగాడు. నువ్వు ప్రశ్నలు వేయి. నేను జవాబు ఇస్తానన్నారు బాబా. "నా ప్రశ్నల్ని మరొకళ్ళు వినటం నాకిష్టం లేదు. పలకపైనో కాగితంపైనో వ్రాస్తాను నా ప్రశ్నల్ని" అన్నాడు మాజీ లాయరు గారు. "ఇది మరీ మంచిది. అలానే చేయి" అని అంటూ, బాబా వెంటనే పలక తెప్పించి ఇచ్చారు. ఆ ఆగంతకుడు పలకపై తన ప్రశ్నలు వ్రాయసాగాడు. అతని ఎదురుగా కూర్చున్న బాబా, తన పలక చేతబట్టి, తనూ చకచకా వ్రాయసాగారు. "నా ప్రశ్నలు పూర్తయినాయి బాబా, ఇదిగో నా పలక" అన్నాడు లాయరు యోగి. "నా జవాబులూ రెడీ. ఇదిగో నా పలక తీసుకో" అన్నారు బాబా. అతని ప్రశ్నలకి సమాధానాలు కనిపించాయి. అవాక్కయ్యాడు. బాబా సర్వాంతర్యామి అనుకొన్నాడు. అతను వెళ్ళిపోయాక, బాబా అన్నారు కదా, "ఎదుటి వాళ్ళ మనోభావాల్ని చదివి చెప్పటం చేయను. కానీ ఈవేళ చేశాను. మండలివాళ్ళ విషయంలో ఈపని తరచు చేస్తుంటాననుకోండి. మీకూ తెలుసు ఈ సంగతి" అన్నారు క్రీగంటతో....



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**
**ఆంగ్ల మూలం:- భావూ కల్చూరీ**
**లార్డ్ మెహెర్, 1925 నుండి**
**తెలుగుసేత: *మల్లాది రామారావ్, మెహెరాబాద్***

**(గత సంచిక తరువాయి)**

మరో మాట శెలవిచ్చారు.
తమ ఎత్తిపొడుపులకీ, ఎద్దేవాలకీ పరమార్థం వుందన్నారు.
సూటిపోటీ మాటలకి ముడుచుకు పోవద్దు.
నా దైవీకార్యక్రమంలో భాగమే నా వ్యంగ్యాస్త్రాలు, అని చెప్తూ
బాబావారొక మాట అన్నారు.
నన్ను యిక్కడ వుండేలా చేసింది మీ ప్రేమ.
ఇక్కడి ప్రతికూల వాతావరణంలో కూడా నన్ను ఎంతగా మీరు ప్రేమిస్తున్నారో తెలుసు.
నేనూ అంత గాఢంగానే ప్రేమిస్తున్నాను మిమ్మల్ని.
ఇంకోమాట చెప్పనా, నా సూటిపోటి మాటలు మిమ్మల్ని కించపరచడానికి కాదు,
మీలో నా పై ప్రేమని అధికతరం చేయడానికే.
గుర్తుంచుకోండి ఈ సంగతి. మీ ప్రేమే నా సర్వస్వం అన్నారు.
ఎక్కడి నుంచి తెచ్చిందో తెలియదు కానీ టేబుల్ టెన్నిస్ (పింగ్ పాంగ్) బల్ల
సంపాదించింది కిట్టీ. బాబావారి గదికి దగ్గరగా పెట్టించిందా బల్లను.
బాబావారు ఘనీతో తలపడ్డారు. హుషారుగా ఆడారు.
ఒకటి రెండు కాదు చాలా ఆటలు ఆడారు.
గెలుపు ఎప్పుడూ ప్రభువుదే కదా. ఆ వేళా అంతే.
వోడి పోయినందుకు కుమిలి పోలేదు ఘనీ.
అవతారుని చేతిలో వోటమి కూడా, వో విజయ సోపానమేనన్నాడాయన.
పింగ్ పాంగ్ అయ్యాక, గ్రామఫోను తెచ్చారు వొకరు.
ఆధ్యాత్మిక గేయాలని వినిపించారు. భక్తి రికార్డులు వేశారు.
ఈ పాటలు బాబావారికి నచ్చాయి. మార్గరెట్ క్రాస్కీకి పని పురమాయించారు.
నృత్యం నీకు వెన్నతో పెట్టిన విద్య కదా.

ఈ పాటలకి తగిన నృత్య భంగిమలని సృష్టించమన్నారు.
ఈ వేళ, ఇప్పుడే చేయాలి ఈ కొత్త నృత్యమన్నారు.
సరేనన్నది మార్గరెట్.
కిమ్ ఆధ్యాత్మిక గీతాలని పాడింది.
సుశిక్షురాలైన గాయకి ఆమె.
సంగీత నాటకంలో వాయిద్య సంగీతానికి అనువుగా పాడగల నేర్పరి కిమ్.
ఇంతకీ ఆమె పాడిన పాటలు ఏమిటో తెలుసా పాఠక మహాశయా.
నల్లవారి ఆధ్యాత్మిక గీతాలని సుమధురంగా ఆలాపించింది.
మెహెరుడు శెహభాష్ చెప్పారు.
లుగానోలో వున్నన్ని రోజులూ సాయంత్రం అవుతూనే,
కదలండి సినిమా చూద్దామనేవారు.
సినిమా కాకపోతే నాటకం చూద్దామనే వారు.
ఇవేది కాకపోతే నృత్య ప్రదర్శనలని చూసివద్దామనేవారు.
అలా చూసిందే స్పెయిన్ దేశపు నృత్యాలు.
బాబావారికి బాగా నచ్చాయి ఆ నృత్యాలు.
నచ్చాయి అనేకంటే బాగా ఆనందించారు బాబా అనటం సబబు.
ఎందుకంటే జనం ఎక్కువగా వున్న చోట్ల తమ పని బాగా జరుగుతుందని
బాబావారే శెలవిచ్చారు వో తూరి.
ఈ స్పెయిన్ నృత్య ప్రదర్శన తర్వాత సినిమాకి వెళ్ళారు అందరూ.
మర్నాడు మే 2వ తేదీన బాబావారు ప్రేమమార్గం గురించి వివరించారు.
భగవదన్వేషణలో ప్రేమ మార్గం గొప్పది కాని,
గులాబీలు పరిచిన పూల పాన్పు కాదు అని స్పష్టం చేసారు.
ప్రేమమార్గంలో ఎటుచూసినా ముళ్ళ పొదలే. అడుగుపెట్టగానే గుచ్చుకొంటాయి.
ప్రాణం గిల గిలలాడుతుంది కాసేపు కానీ, ఈ బాధ కూడా అవసరమే.
వొంటిపై పుండ్లు వస్తే ఏమి చేస్తారు?
డాక్టరు దగ్గరకి వెడితే, ఆపరేషన్ చేయించుకోమంటాడు.
అవునా? ఆపరేషన్ అంటే, కత్తితో కోస్తాడు కదా పుండు దగ్గర.
అప్పుడు నొప్పి పుడ్తుందా?
ఆ నెప్పి ఎవరి కోసం. నీ మంచి కోసమే కదా.
శస్త్ర చికిత్స చేస్తుంటే మీరు కుయ్యోమొయ్యో అన్నా డాక్టరు పట్టించుకుంటాడా!
తన పని చేసుకుపోతాడు.

ఆపరేషన్ వల్ల మీకు ఏమవుతుంది.
వుండు గుడ్‌బై చెప్తుంది. నేను చేస్తున్న పని కూడా యిదే.
నిరతంతరం మీరు ఆనందంగా వుండాలి. ఇదే నా అభిలాష.
మరి ఈ గమ్యం చేరేది ఏలాగ?
నాదైన శైలిలో పనిచేస్తున్నాను మీ అందరి ఆనందం కోసం.
నా పనితీరు వల్ల మీకు బాధ కలుగుతుంది. అసూయ పుడుతుంది.
అయినా నా పని నేను చేసుకుపోతాను.
ఈ సంగతి కిమ్‌కో బుర్రకి ఎక్కిందని అనుకోను.
ఏం చేస్తాం? ఒక పని చేస్తాను.
నేనిక మీదట ఇప్పటిలా పనిచేయను, అంటే ఎద్దేవా చేయను.
ఇంకో మార్గం పట్టాను, మీకు శాశ్వత ఆనందం ప్రసాదించడానికి, అన్నారు.
వెంటనే కిమ్‌కో ప్రభుతులు అన్నారు కదా మీ ఇచ్ఛ నేరవేర్చడమే మా అందరి విధి.
మీ సంతోషమే కావాలి మాకు. మా గురించి పట్టించుకోకండి అన్నారు.
ఒక్కమాటలో చెప్పాలంటే, వారందరికి వాళ్ళ తప్పు తెలిసివచ్చింది.
బాబావారి సూటిపోటి మాటలు కూడా తమ మంచికేనని బుర్రకెక్కింది.
బాబా అన్నారు కదా, ఒక్క మింటో తప్ప అందరూ వెళ్ళిపోండి అని.
మింటోని తమకి దగ్గరగా కూర్చోమన్నారు. ఆమె వచ్చి కూర్చుంది.
బాబావారు ఏమి చెప్తారో విందామని కుతూహలంగా వుంది.
బాబావారు అన్నారు కదా ఇప్పటిదాకా నే చెప్పింది విన్నావు కదా.
మీరు అందరూ ఆనందంగా వుండాలి ఎప్పుడూ.
ఇదే నా యిచ్ఛ. సూటి పోటి మాటలు అన్నా, దెప్పి పొడిచినా, ఎద్దేవా చేసినా,
మీరు బుర్ర పట్టుకొని ఏడుస్తూ కూర్చోమని కాదు.
మీ మంచికే చేస్తున్నాను యిలా.
ఇందాక చెప్పానే డాక్టరు శస్త్రచికిత్స గురించి.
నేనూ డాక్టరునే కదా. నేను విశ్వ డాక్టరుని.
నా శస్త్రచికిత్స – యీ ఎద్దేవాలు, విదిలింపులు అంటూ చాలా వివరంగా మళ్ళీ చెప్పారు.
మింటోకీ, కిమ్‌కీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది.
అంతగా వారిద్దరి మధ్య పేరుకొంది ఈర్ష్య, అసూయ.
ఎందుకుటా అంటే ఇద్దరూ బాబావారికి దగ్గరగా వుండాలనుకొంటున్నారు.
ప్రభువు బట్టలు వుతకడం, ప్రభువు గదిని శుభ్రంగా వూడ్చడం,
ఇలానే మెహెరీశుని తల దువ్వడం, నేను చేయాలంటే నేనే చేయాలని

పోటాపోటీ పడుతున్నారు ఇద్దరూ. వారిద్దరి వైరం బాబావారికి తెలియకపోతే కదా!
'ఇహ నీ పని చూసుకో' అంటూ బాబావారు మింటో పాఖ్యానికి తెరదించారు.
నువ్వు వెళ్ళు. రమ్మన్నానని అందరికీ చెప్పు, అన్నారు.
ఈ పిలుపు కోసమే ఎదురుచూస్తున్నారేమో, అందరూ బిరబిరా వచ్చారు.
బాబావారన్న మాటతో అమ్మో! అనిపించింది. ఇంతకీ బాబావారు ఏమన్నారు?
మీ అందరికీ పరీక్ష పెడుతున్నానన్నారు. ఈ పరీక్ష ఎందుకట?
బాబావారి విశ్వ కార్యక్రమంలో వాళ్ళకీ సముచిత పాత్ర వుంటుందట.
మరి ఆ పాత్రని ఎంత సజావుగా నిర్వహిస్తారు అని పెడ్తున్నాను ఈ పరీక్ష అన్నారు.
ఇంకోమాట అన్నారు. ఆ మాట వింటానే ఖంగు తిన్నారు.
ఇంకో పరీక్షలో నెగ్గాలి మీరన్నారు.

**-సశేషం**

## అవతారుని ఉవాచ
# సంఖ్యామానంలో ఏడు విశిష్టత

**ఒక రోజున బాబావారు ఎప్పటిలానే సృష్టి విచిత్రాలని మెహెరాశ్రమం పిల్లలకి చెప్పారు.**
సంఖ్యామానంలో ఏడు విశిష్టతని వివరించారు.
ప్రపంచాలు, ఆకాశాలు, సూర్యుడు, చంద్రుడు, భూమికలు, స్వరాలు ఇవి అన్నీ ఏడేసి చొప్పున వున్నాయన్నారు. అంటే సృష్టిలో ఏడు ప్రపంచాలు వున్నాయి. అలానే ఏడు ఆకాశాలు, ఏడుగురు సూర్యులు, చంద్రులు ఏడుగురు వున్నారు. భూమికలు ఏడు వున్నాయి. స్వరాలు కూడా ఏడే.
వ్యావర్తన దశలోనే స్వర్గాలున్నాయి.
ఇలా ఇవన్నీ ఏడేసి చొప్పున ఎందుకున్నాయి?
ఇవే కాదు, సంస్కారాలు కూడా ఏడు రంగుల్లో వున్నాయి. ఎందువల్లన అంటే, సృష్ట్యాదిలో శక్తి, ఘన పదార్థంతో ఢీకొంది. ఏడు ఖండాలు ఏర్పడ్డాయి. అప్పుడే సప్త వర్ణాలు కన్పించాయి. ప్రతి మనిషిలోనూ అనంత విశ్వం వుంది. ఇది అతిశయోక్తి కాదు. తల తీసుకోండి. రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసికా రంధ్రాలు, ఒక నోరు వెరసి మొత్తం ఏడున్నాయి. అలానే శరీరంలో కూడా ఏడు భాగాలున్నాయి. రెండు చేతులు, రెండు కాళ్ళు, శరీరం ముందుభాగం, శరీరం వెనకభాగం, మొండం, మొత్తం ఏడు భాగాలున్నాయన్నారు బాబా.

***

### అవతారుని ఉవాచ

# సృష్ట్యాదిలో ఏం జరిగింది?

**మెహెరాబాద్, 1927 డిశంబరు 27**

**సృష్ట్యాదిలో ఏం జరిగింది? ఈ విషయమై మెహెర్‌బాబా సోదాహరణంగా ఇలా చెప్పారు.**

**శక్తి, ఆకాశంతో ఢీ కొట్టినప్పుడు అగ్ని, నీరు, వాయువు, భూమి** ఏర్పడ్డాయి. ఇవి ఒకదాని తర్వాత మరొకటి వెంట వెంటనే వచ్చాయి. శిలలు, లోహాలు, కూరాకులు, క్రిములు భూమికి సంబంధించినవి. చేపలు నీటికి చెందినవి. వాయువుతో పక్షులు, అగ్నితో జంతువులు, అన్ని భూతాలతో ముడిపడి మనిషి పుట్టుకు వచ్చారు. అగ్ని అంటే మెరుపు. ప్రతిచోట మెరుపు మెరిసింది. ఈ ధరణీదాతకం దాన్ని ఆవరించింది. ఈ మెరుపు వల్లనే జంతువుల్లో జీర్ణశక్తి బాగా పెరిగింది. **జంతువులు తిండిపోతులు. కేవలం తినడానికే పుట్టాను అన్నట్లు తెగ తింటాయి. బొంబాయి** జంతు ప్రదర్శన శాలలలో ఏనుగు వుంది. ఈసారి అక్కడికి వెళ్లినప్పుడు తప్పకుండా దాన్ని చూడండి. అది ఎప్పుడూ ఏదో నములుతూనే కనిపిస్తుంది.

**కూరాకుల ప్రపంచంలో పుట్టిన మొదటి పురుగు రంగు ఆకుపచ్చ రంగు. ఆఖరిన పుట్టినది** యెంద్రకాయ. చెమ్మ మట్టిలో వుంటుంది. అంటే నీళ్ళలోకి కూడా పోతుంది. యెంద్రకాయ తర్వాత చేప పుట్టింది. చేప వుండేది నీళ్ళలోనే కదా. ఈ పరిణామక్రమంలో ఆఖరిది కప్ప. మీకు తెలుసుగా. కప్ప నీళ్ళలో వుంటుంది. నీళ్ళ నుంచి బయటకి రావాలని చూస్తుంది. ఈ జీవ పరిణామక్రమంలో ఇదొక పెద్ద మలుపు అనవచ్చు. కప్ప తర్వాత జలపక్షి వచ్చింది. పక్షుల్లో కూడా కొన్ని నీళ్ళపై ఎగురు తుంటాయి. నీళ్ళ చుట్టూనే తిరుగుతుంటాయి. ఎందుకో తెలుసా? చేప దశ తర్వాత వచ్చిన మొదటితరం పక్షులు ఇవి. ఆ తర్వాత తరం పక్షులకి గాలి అంటే మక్కువ ఎక్కువ. అందుకే అవి ఎగురుతూ కన్పిస్తాయి. పక్షుల దశలో ఆఖరున వచ్చినది గిన్నె కోడి. ఇవి ఎగురుతాయి. నడుస్తాయి. పరుగెడతాయి.

**దరిమిలా జంతువుల దశ మొదలైంది. ఆస్ట్రేలియా, న్యూజిలెండ్ దేశాల్లో ఇప్పుడు ఎక్కువగా** కనిపించే కంగారూలు పుట్టాయి. ఇవే జంతు ప్రపంచంలో పుట్టిన మొదటి ప్రాణులు. జంతువుల పరిణామక్రమంలో ఆఖరున ఎవరు వచ్చారు. మీ ఊహ కరక్టే! కోతులు పుట్టాయి. కోతి తర్వాత మనిషి పుట్టాడని బాబా స్పష్టం చేశారు. ఆ తర్వాత, సర్వజ్ఞత

## సర్వజ్ఞత అంటే?

అంటే ఏమిటో ఇలా వివరించారు. **జ్ఞానం నాలుగు రకాలు. ప్రాపంచిక జ్ఞానం, భూమికల జ్ఞానం, ఏడవ భూమికలో స్వీయ జ్ఞానం.** అవతారునికే పరిమితమైన సర్వజ్ఞత – ఇలా జ్ఞానం నాలుగు రకాలు. అవతార పురుషుడు, సద్గురువులు నిర్వహించే కార్యక్రమం, సర్వజ్ఞత – అదే – విశ్వ కార్యక్రమం ముల్లోకాలకీ సంబంధించింది. ముల్లోకాలనీ ప్రభావితం చేస్తుంది అని బాబా పేర్కొన్నారు. భూమికలు, స్వర్గాల గురించీ చెప్పారు. మన శరీరంలోనే సప్త భూమికలకి, సప్త స్వర్గాలకి సమతుల్యమైన భాగాలున్నాయన్నారు. భూమికలు శరీరం ముందు భాగాలతో, స్వర్గాలు శరీరం వైనుక వైపు భాగాలతో సమతుల్యమైనవని అన్నారు.

**మొదటి భూమిక : నాభి., రెండవ భూమిక : ఛాతి ఎడవ వైపు**
**మూడవ భూమిక : ఛాతి కుడి వైపు, నాల్గవ భూమిక : గొంతు క్రింద**
**ఐదవ భూమిక : గొంతు మధ్య,**
**ఆరవ భూమిక : భృకుటి (రెండు కళ్ళ మధ్యభాగం – త్రినేత్రం)**
**ఏడవ భూమిక : శిరస్సు పైన లేదా కపాలం మధ్యగా**

**ఈ ప్రకారంగా శరీరం ముందు భాగాలతో సప్త భూమికలు సమతుల్యమైతే, సప్త స్వర్గాలు శరీరం వెనుక భాగాన వున్నాయి.**

**మొదటి స్వర్గం :** నాభి వెనుక, **రెండవ స్వర్గం :** ఎడమ ఛాతీ వెనుక వుంటాయి. ఇలానే మూడు, నాలుగు, ఐదు, ఆరు స్వర్గాలు కూడా. మూడు, నాలుగు, ఐదు, ఆరు భూమికలకి వెనుక భాగాన వుంటాయి. అంటే మూడవ స్వర్గం ఛాతీ కుడిభాగం వెనుక, నాల్గవ స్వర్గం గొంతు క్రింద భాగానికి వెనుక, ఐదవ స్వర్గం: గొంతు మధ్యకు సరాసరి వెనుక, ఆరవ స్వర్గం: భృకుటికి వెనక వున్నాయి. ఆఖరి స్వర్గం, అంటే ఏడవ స్వర్గం తల వెనుక వుంటుంది.

**భగవదనుభూతి కోసం యోగులు స్వర్గ మార్గాన ప్రయాణిస్తారు. ఇదేమీ సుళువైన మార్గం కాదు.** ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. వాటిని దాటడం చాలాకష్టం. అసాధ్యం అన్నా అతిశయోక్తి కాదు. స్వర్గాల్లో కళ్ళు మిరుమిట్లు కొల్పే అద్భుతాలు ఎన్నో దర్శనమిస్తాయి. వాటివైపు ఆకర్షితులు కాకుండా వుండ లేరు ఎవ్వరూ. ఒక్కసారి, స్వర్గ మహిమలకి లోనయితే, సాధకుడు ముందుకు వెళ్ళలేడు. ప్రతిస్వర్గం ఒక మహానగరం అయితే, ప్రతి భూమిక రైల్వేస్టేషను అనవచ్చు. రైలు ఎక్కితే ఏముంది, గమ్యం చేరటం ఎక్కువసేపు పట్టదు. భూమికల మార్గంలో ప్రయాణం సాఫీగా జరుగుతుంది, అవతారుని కృప వుంటే. నగరాల్లో ఆకర్షణలు ఎన్ని వుంటాయో తెలుసు కదా.

వాటిని వొక్కొటీ చూస్తూంటే సమయం ఇట్టే గడిచిపోతుంది. అందుకనే స్వర్గ మార్గాన సాధన ప్రారంభిస్తే గమ్యం వో పట్టాన చేరలేరని వేరే చెప్పాలా? మార్గమధ్యంలోని ఆకర్షణల ప్రభావంలో ప్రయాణం కుంటుపడుతుంది.

## త్రాగుబోతు ప్రపంచం

**నిరుపేద వొకడున్నాడు. సంపాదన లేదు. ఉద్యోగం సద్యోగం లేదు. బిక్షాటన అతని వృత్తి. నలభై** అయిదు మంది అతని సంతానం. పెళ్ళాం, పిల్లలతో దేశాటన చేస్తున్నాడు. బిక్షాటన చేసి వాళ్ళ కడుపు నింపుతున్నాడు. భగవంతుడా! ఎంతకాలం ఇలా చేయను. వో పది రూపాయలు ఎవరైనా ముష్టి వేస్తే, ఈ వేళ పిల్లలకి తిండిపెడ్తాను అని మొరపెట్టుకొన్నాడు. నన్ను దేముడు కరుణిస్తాడా అని వాపోతూ వెడుతుంటే, రోడ్డుకి వో ప్రక్కన రత్నాల రాసి కనిపించింది. ఆహా! ఏమి అదృష్టం అని మురిసిపోయాడు. మరి ఆ రత్నాల రాసి దగ్గర మన మిత్రుడు ఆగిపోయాడా? లేదా? అంటే, అసలు అక్కడి నుంచి కాళ్ళు కదిలితే కదా! ఓ సద్గురువు కనుక అప్పుడు వుంటే, "పిచ్చి భ్రమలో పడకురా" అని హితవు చెప్పి, ముందుకు వెళ్ళేలా చేసేవాడు.

**మీకో మాట చెప్పనా! త్రాగిన మైకంలో వున్న వాడికి చిన్న నీళ్ళ గుంట కూడా సముద్రంలా కనిపిస్తుంది.** ఫరవాలేదు రా! నేనున్నాను. నీళ్ళ గుంటలో నీకేమీ కాదు. నేను తీసుకు వెడతాను జాగ్రత్తగా, అని ఎంతగా చెప్పినా మీ మాట వినడు. పోనీ బలవంతాన నడిపిస్తే, సరిగ్గా నడుస్తాడా, అదీ వుండదు. మత్తు ప్రభావంలో గాలిలో తేలిపోతున్న భావన వచ్చి వూగిపోతూ నడుస్తాడు. అతగాడి కళ్ళకి అన్నీ భూతద్దంలో నుంచి చూసినట్లు కనిపిస్తాయి. ఇవి ఎన్ని వేళ్ళని రెండు వేళ్ళు చూపిస్తే, ఠపీమని ఇవి నాలుగు అంటాడు. తప్పురా! ఇవి రెండు వేళ్ళేరా అని ఎంత వోపికగా చెప్పినా మీ మాట పట్టించుకోడు. తన ధోరణిలోనే మాట్లాడుతాడు. ఇది త్రాగుబోతు ప్రపంచం. మత్తు కళ్ళకి కనిపించిందే నిజమని నమ్ముతారు. మీరు కూడా ఇలా త్రాగుబోతు మాదిరిగా ప్రపంచమే వాస్తవమైందన్న తప్పు అభిప్రాయంలో వున్నారు.

**మీరు చూస్తున్నది అంతా వో భ్రాంతి, వో కల, నిజం కాదు అని నేను చెప్పినా మీకు** కొరుకుడు పడదు. నన్ను నమ్మండి. నా మాట వినండి. నన్ను ప్రేమించండి. నా ప్రేమ వల్ల భగవంతుడు వొక్కడే సత్యము అన్న వాస్తవం వో రోజుకి మీకే తెలిసి వస్తుంది. భగవంతుడు తప్ప మిగిలినవన్నీ భ్రాంతి అని గ్రహిస్తారు అని బాబావారు శెలవిచ్చారు.

****

## అమరతిథి వేదికపై ... శ్రీ బి. రామక్రిష్ణయ్య ప్రసంగం

# అవతారుని దివ్యత్వం- మన కర్తవ్యం



**ప్రతి యుగంలో నిరాకారుడైన భగవంతుడు** సాకారుడై మన మధ్యకు మానవ రూపం ధరించి వస్తాడు. ఆయననే మనం అవతారుడు అని అంటాము. ఆయన్నే మెస్సయ్య, ప్రాఫెట్, దైవ కుమారుడు అని కూడా అంటాము.

**మొట్టమొదటిసారిగా నేను భగవంతుడననే అను భవాన్ని** అనంత శక్తిని, జ్ఞానాన్ని, ఆనందాన్ని పొంది నిరంతరం ఆ సచ్చిదానంద స్వరూపాన్ని అనుభవించే ఆ దేవుడే తనకు అవసరం లేకపోయినా అందరి కోసం, సకల చరాచర సృష్టి కోసం అవతారుడుగా వచ్చే కర్తవ్యాన్ని, భాధ్యతను స్వీకరించాడు. మళ్ళీ మళ్ళీ సృష్టి కోసం వచ్చే వాడొక్కడే అందుకనే ఆయనను సనాతనుడని అంటాము. నామ, రూపాలు మారినా ప్రతియుగంలో వచ్చే ఆ సనాతనుడైన అవతారుడొక్కడే. ఆయనే ఈ కాలచక్ర భ్రమణంలో జొరాష్టరుగా, రాముడుగా, కృష్ణుడుగా, బుద్ధుడుగా, జీసస్ క్రీస్తుగా, మహమ్మద్ ప్రవక్తగా గతంలో అవతారుడుగా వచ్చి నేడు ఈ కలియుగంలో మెహెర్‌బాబాగా అవతరించాడు.

**సృష్టిని, దాని గమ్యమైన భగవదైక్యానికి చేర్చి దాని కోసం పరిణామంలో సంక్రమించిన** మానవ రూపంలో అనేక జన్మలెత్తుతూ పునర్జన్మ క్రమంలో చిక్కుకొని పోయిన మానవులను అజ్ఞానం నుండి మేల్కొల్పి, చైతన్యవంతులను చేసి త్వరగా గమ్యాన్ని చేర్చే పనియే అవతారుని విశ్వకార్యం. దానికోసం ఐదుగురు సద్గురువుల పర్యవేక్షణలో 7000 మంది ఉన్నతాత్మలతో కూడిన పాలక వర్గాన్ని ఏర్పాటు చేసాడు ఆ భగవంతుడైన సనాతనుడు. ఆ పంచ సద్గురువులు ఎల్లప్పుడు ఉంటారు. ఒక సద్గురువు శరీరం చాలిస్తే వెంటనే ఆ సానం ఆ స్థాయిని చేరిన జీవన్ముక్తునితో భర్తీ అవుతుంది. వారే ప్రతి యుగంలో అవతారుని రాకకు సమయమాసన్నమవగానే రంగం సిద్ధం చేసి అజ్ఞానమనే ముసుగును కప్పి ఎంచుకొన్న కుటుంబంలో ఆయన జన్మించి పెరిగి పెద్దవాడయ్యే భూమికను నిర్వహిస్తారు. అవతారుడుగా తన పనిని చేపట్టే సమయమాసన్నమవగానే ఆయనపై కప్పిన ముసుగును తొలగించి విశ్వ కార్యభారాన్ని ఆయనకు అప్పగిస్తారు. దీనిని స్టే విత్ గాడ్ అనే గ్రంథంలో ఫ్రాన్సిస్ బ్రాబజాన్ "అటుల సద్గురువులవతారునికి మాతా పితరుల పాత్ర వహింతురు" అని వర్ణించాడు అతి సహజంగా. అవతారునికి విశ్వకార్య

భారాన్ని యిచ్చిన తర్వాత సద్గురువులు వి(శమించి ఆనందిస్తారు. మళ్ళీ అవతార కాలం ముగిసిన తర్వాత అప్పుడుండే సద్గురువులు విశ్వకార్య భారాన్ని స్వీకరించి మళ్లీ ఇంకొక యుగారంభంలో అవతారుడు వచ్చే దాకా నిర్వహిస్తారు. అది అవతారుడు నిర్ణయించిన దివ్య (పణాళిక (పకారంగా నెరవేరుస్తారు. శరీరం వదిలేసిన తర్వాత సద్గురువులు మళ్ళీ మానవ రూపం ధరించి రావడముండదు. వారు ఆ స్థితిలో అనంత ఆనందాన్ని అనుభవిస్తూ ఈ సృష్టితో అంటే మాయా(పపంచంతో సంబంధం లేకుండా ఉంటారు. అవతారుడొక్కడే ఈ సృష్టితో అంతంలేని సంబంధాన్ని కలిగి ఉంటూ 700 సంవత్సరాలకొకసారి గాని లేదా 1400 సంవత్సరాలకొక సారి గాని ఈ భూమిపైన అవతరిస్తాడు. అందువల్ల అవతారుడు ఈ సృష్టిని నడిపే ఉన్నతోన్నతుడు అనడంలో అతిశయోక్తి లేదు. ఈ కలియుగంలో ఆ సనాతనుడైన భగవంతుడే ఆ ఉన్నతోన్నతుడు, అనంత శక్తి, అనంత జ్ఞానం, అనంత ఆనందాలను అనుభవించే ఆ సచ్చిదానంద స్వరూపుడే మెహెర్‌బాబాగా భరతభూమిలో పూణే నగరంలో అవతరించాడు. ఆయన అవతరించడానికి అసలైన భూమికను నాటి పంచసద్గురువులే నిర్వహించారు. వారు (1) పూణేలోని హ(జత్ బాబాజాన్ (2) షిరిడీ సాయిబాబా (3) ఉపాసనీ మహరాజ్ (4) నాగపూర్‌లోని తాజుద్దీన్ బాబా (5) కేడ్‌గావ్‌లోని నారాయణ మహారాజు. మెహెర్‌బాబా నుదుట ముద్దాడి హ(జత్ బాబాజాన్ అవతారుని పైన కప్పిన అజ్ఞానపు ముసుగు తొలగించగా, షిరిడీ సాయిబాబా ఓ పర్వర్దిగార్ (అనగా సృష్టిరక్షకా – విష్ణువని) సంబోధించి, ఉపాసనీ మహారాజు స్వయంగా హారతి యిచ్చి నీవు ఆదిశక్తివి – అవతారుడవు అని మెహెర్‌బాబా అవతరణను (పకటించి ఆయన దివ్యత్వాన్ని లోకానికి తెలియజేసారు.

**అవతార్ మెహెర్‌బాబా స్వయంగా తాను సనాతనుడనైన అవతారుడనని, ఉన్నతోన్నతుడ నని,** జోరాష్టర్‌ను, రాముడను, కృష్ణుడను జీసస్ మరియు బుద్ధుడను, మహమ్మద్ (పవక్తగా వచ్చినది తానేనని స్పష్టంగా చెప్పారు. (పస్తుత (పపంచ పరిస్థితులు, మానవుల స్థితిగతుల ననుసరించి అమితమైన బాధలనుభవించానని, నేటి (పపంచంలో అణగారియున్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఉన్నత స్థాయికి చేర్చడానికి, ఆధ్యాత్మిక ఉప్పెనను సృష్టించి (పపంచ పరిస్థితిని తల(క్రిందులు చేయబోతున్నానని మెహెర్‌బాబా (పకటించారు. ఆయనను సాధారణ సంతులు, సత్పురుషులు, యోగుల లాగా భావించి వారి జతలో చేర్చకుండా, ఉన్నతోన్నతుడైన అవతారునిగా విశ్వసించి ఆయన కృపకు పా(తులమై ఉన్నతమైన ఆధ్యాత్మిక లాభాన్ని పొందాలనే ఆయన ఆదేశాన్ని పాటించడమే మన కర్తవ్యం. కేశవనారాయణ్ నిగమ్ యాచించినట్లు **“అమర్ మిలన్ హెూ (పియతమ్ తుమసే, చూటే యహ జగ్ సారా”** అని దునియా దౌలత్ మాల్ ఖజానా తుమరెపాయ **ఠుక్‌రావూ అని** చేసే సర్వార్పణ మన కర్తవ్యం – అవతార్ మెహెర్‌బాబాకీ జై.

## మెహెరాబాద్‌లో రెండ్రోజుల

# ఆసక్తికర చర్చా గోష్ఠి

**"అవతారుని నిధి ఆవిష్కరణ" అన్న మకుటంతో** ఆసక్తికరమైన చర్చాగోష్ఠి జరిగింది మెహెరాబాద్‌లో ఫిబ్రవరి 6,7 తేదీల్లో. మెహెరీశుని సేవలో పండిన ఎందరో పెద్దలు పాల్గొన్నారీ కార్యక్రమంలో. 1967 నుంచి 1969 వరకూ బాబావారి కార్యక్రమాలని సమీక్షించారు. మెహెరుని వారసత్వం అంటూ వక్తలు "ఆఖరి దర్శనం" విశిష్ఠమైనది అన్నారు. బాబావారి ఉచితాసనం ఆ దర్శనంలో ఖాళీగా కనిపించి వుండవచ్చు కానీ, మన అందరి హృదయాల్లో మెహెరుడు వూపిరి పోసుకొంటున్నాడని వ్యాఖ్యానించారు.

**"సుదీర్ఘ ఏకాంతవాసం" గురించి ప్రశాంత్ అహిర్ (పుణే) ప్రసంగిస్తే, తెనుగు తేజం గణేష్ అదితాం** బాబావారు మన మధ్యన గడిపిన ఆఖరి నెల విశేషాలని ప్రస్తావించారు. మరో తెలుగు తేజం డి.ఎ.బాలకృష్ణ మెహెర్, ప్రసంగాంశం– లైఫ్ సర్క్యులర్లు. 1966 నుంచి 1969 వరకూ బాబావారు పెద్ద ఆదీ ద్వారా పంపిన సర్క్యులర్ల విశిష్ఠత యింతా అంతా కాదన్నారు. బాలకృష్ణ కథనం ప్రకారం, బాబావారి సర్క్యులర్లు దిశానిర్దేశం చేస్తున్నాయి మానవాళికి. నేటికే కాదు భవిష్యత్‌కి కూడా. కోవిడ్ వంటి ఉపద్రవాల్లో భుజం తట్టి, ధైర్యం చెప్తాయి ఈ సందేశాలు అన్నారాయన.

**బాబావారి ఆరోగ్యం ఆఖరి రోజుల్లో బాగా క్షీణించింది. డాక్టర్లకే పరీక్ష పెట్టింది అన్నారు** నవసారీ డాక్టరు అజిత్ సోనీ. పూణే తీసుకు వెడతాము, మంచి వైద్య సేవలు దొరుకుతాయి అక్కడ అని ఎంతగా చెప్పిన బాబావారు పట్టించుకోలేదన్నారాయన.

## జిడ్డు సుబ్రహ్మణ్యం

**పూణే ఎప్పుడు వెళ్ళినా బాబావారి బస - బరోడా మహారాణి శాంతా దేవి గారి** గురుప్రసాద్‌లో. "ఈ భవంతి మీదే, తీసుకో ప్రభూ" అంటే బాబావారు సున్నితంగా తిరస్కరించారుట. "ఆఖరి దర్శనం" దరిమిలా ఈ ప్రస్తావన మళ్ళీ చేశారుట శాంతాదేవి. అయితే ఈసారి వద్దన్నది మండలివారు. మాకు ఎందుకీ గుదిబండ అన్నారు పెద్ద ఆదీ. ఈ వివరాలని గుర్తుచేస్తూ జిడ్డు సుబ్రహ్మణ్యం (హైదరాబాద్) 1967–68లో బాబావారి గురుప్రసాద్ బసపై సోదాహరణ ప్రసంగం చేశారు. అమెరికా నివాసి డాక్టర్ జేమ్స్ నేవెల్ ప్రసంగాంశం – బాబా ప్రేమ మతం, నామ ప్రచారం. బాబావారి రహస్య గ్రంథం గురించి రిచర్డ్ బ్లుమ్ మాట్లాడుతూ, మెహెరీశుని మౌనానికి, అవతార వ్యక్తీకరణకీ మధ్య వారధి కావచ్చు ఆ పుస్తకం అన్నారు. మెహెర్‌నోశ్ మెహెతా (ముంబాయి) పీటర్ నోర్డీన్ (అమెరికా), రాబర్ట్ ఫ్రెడెరిక్స్ (అమెరికా), జాన్ గుణ్ (అమెరికా) ప్రభుతులు

పాల్గొన్న ఈ చర్చా గోష్ఠికి 15 సంవత్సరాల క్రిందట శ్రీకారం జరిగింది,

**ట్రస్ట్ లైబ్రరీ కమిటీ ఆధ్వర్యంలో బాబావారి ప్రేమలో అనుభూతి, అనుభవాలను నలుగురితో** పంచుకోవాలన్న లక్ష్యంతో "అవతారిక్ లెగసీ" చర్చా గోష్ఠిని 2010లో ప్రారంభించా మన్నారు శ్రీధర్ కేల్కర్, మాజీ ట్రస్ట్ చైర్మన్. **మొదటి సంవత్సరం స్వచ్ఛంద కార్యకర్తలు మెహెరాబాద్‌లో తమ పని గురించి మాట్లాడారు.** రెండవ సంవత్సరం వక్తలు – బాబా సెంటర్ల నుండి వచ్చిన పెద్దలు. ప్రభు నామ ప్రచారానికి తమ వంతు కృషి గురించి మాట్లాడారు. 2013 నుంచి "లెగసీ" గోష్ఠిలో చర్చనీయాంశం: అవతారుని జీవితం, పని. ఒకటి రెండు సంవత్సరాలని ఎంచుకొని, ఆ వ్యవధిలో ప్రభు జీవిత విశేషాలను మననం చేస్తున్నారు. తద్వారా ప్రేమికలోకం గురుతర బాధ్యతని గుర్తుచేస్తున్నారు. **ఈ ఏటి చర్చాగోష్ఠిలో ఆఖరి ఇరవై అయిదు నెలలపైన, మెహెరాజాద్, గురుప్రసాద్‌ల్లో** బాబావారి ఏకాంతవాసం, ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి మాట్లాడారు వక్తలు. బాబావారి జీవిత చరిత్ర "లార్డ్‌మెహెర్" ని నలుగురికీ అందుబాటులోకి తేవడానికి హైదరాబాద్‌లో పునర్ముద్రించామన్నారు ట్రస్టీ రాజేంద్ర మెహెర్. **బాబావారికి యిష్టమైన బిగిన్ ది బిగైన్ పాట ప్రత్యేకత, గోకర్ణ శ్రీవాత్సవ (మెహెరాబాద్)** వివరించారు. ఈ పాటని నలుగురు కలిసి పాడటంతో తెరపడింది చర్చా గోష్ఠికి.

# శంషాబాద్‌లో నూతన బాబా కేంద్రం ప్రారంభం

**శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సుమారు 4 కిమీ దూరంలో వున్న రాళ్ళగూడాలో అవతారుని** నూతన కేంద్రం శివరాత్రి పర్వదినాన 2026 ఫిబ్రవరి 15న ప్రారంభించి సహవాస్ కార్యక్రమం నిర్వహించారు. ఇకపై ఈ కేంద్రంలో ప్రతి ఆదివారం సాయంత్రం 6 నుండి 7 వరకూ సత్సంగ్ నిర్వహిస్తామన్నారు. శ్రీ నోరి సూర్యనారాయణ, శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ అజయ్ బాబు, శ్రీ పిడుగు అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలో,** తన తండ్రి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో విశాలమైన ప్రార్థనా మందిరం నిర్మించిన చంద్రమోహన్‌కు బాబా ప్రేమికులు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో అత్తాపూర్ అనే మరో ముఖ్యమైన ప్రాంతంలో కూడా బాబా కేంద్ర భవనాన్ని నిర్మించి బాబా కార్యక్రమాలను గత రెండేళ్ళుగా శ్రీ చంద్ర మోహన్ నిర్వహిస్తున్నాడు. ఈ కేంద్రాల నిర్మాణం కోసం విరాళాలు సేకరణ చేపట్టని శ్రీ చంద్రమోహన్ (74163 23061) ఇదంతా బాబావారి కృప వల్లనే సాధ్యమౌతోందని వినమ్రంగా అవతారునికి రెండు చేతులూ జోడిస్తున్నాడు. వీలుచూసుకుని అత్తాపూర్, శంషాబాద్ కేంద్రాల సత్సంగ్ కార్యక్రమాలలో పాల్గొనండి. జైబాబా చెప్పండి!

క్రొత్త పుస్తకాలు

# మెహెరీశం సంచిక 1 & 2







**మెహెరాబాద్‌లో శ్రీ మల్లాది రామారావు గారింట 2026** జనవరి 18న జరిగిన ప్రత్యేక ప్రేమిక సహవాస్‌లో మెహెరీశం సంచిక-2 లాంఛనంగా అవిష్కరించడ మైంది. అవతారుని జీవిత చరిత్రలో 1929- 1931 నడుమ జరిగిన అనేక ఆసక్తికర సంఘటనల్ని ప్రముఖ జర్నలిస్టు శ్రీ మల్లాది రామారావు 'మెహెరీశం' రెండవ సంచికలో గ్రంథస్తం చేశారు. ఈ గ్రంథం భావూజీ విరచిత 'లార్డ్ మెహెర్' ఆంగ్ల గ్రంథానికి కేవలం తెలుగు అనువాదం కాదు. ఈ గ్రంథంలో బాబా తన సందేశాలను నేరుగా పాఠకులతో చెబుతున్నట్లుంది. మూల రచనలోని భావాన్ని, స్ఫూర్తిని, రచయిత తనదైన శైలితో చక్కని అనుసృజన రచన **చేశారు. మొత్తం పుటలు 526. పుస్తకం ఖరీదు రూ. 300/-. కాగా, మెహెరీశం తొలి సంపుటి 2026 జూలైలో మెహెరాబాద్‌లో ఆవిష్కరించడమైంది. మొత్తం పుటలు 512. పుస్తకం ఖరీదు రూ. 250/-.**

ఇది అవతారుని సమగ్ర జీవిత చరిత్ర. ప్రతి ఒక్కరూ తప్పక చదవవల్సిన గ్రంథాలు. ప్రతి ఇంటా ఉండవల్సినవీను. **పుస్తక ప్రతుల కోసం కేరాఫ్ మెహెర్‌బాబా పత్రిక, మొబైల్ నంబరు 95595 53218** సంప్రదించగలరు.

## బాబా కేంద్రాలకు ఉచితంగా

**మెహెరీశం పార్ట్ 1 పార్ట్ 2 పుస్తకాలను తెలుగునాట గల నూరు బాబా కేంద్రాలకు ఇటీవల "బాబా ప్రేమ కానుకగా" అందజేయడమైంది. మెహెరీశం నిత్య పఠనీయం. ఈ గ్రంథాలను ఆయా బాబా కేంద్ర గ్రంథాలయాల్లో పాఠకులకి అందుబాటులో వుంచవల్సిందిగా కోరుతున్నాం.**

**హైదరాబాద్‌లోని బాబా ప్రేమికులొకరు, అలాగే, బెంగళూరు, జయానగర్ కేంద్రంవారు మెహెరీశం రెండు సంచికలను నూరు బాబా కేంద్రాలకు అందజేసేందుకు సహకరించారు. వారిద్దరికి ధన్యవాదములు. జైబాబా.**

## 1926 జనవరి 7వ తేదీన బాబా ఇచ్చిన సందేశం

# సేవ అంటే ఏమిటి?

**దిక్కుమొక్కులేని నిరుపేదలని ఎలా సేవించి తరించాలో వివరించారు.**
"**సేవ అంటే** ఏమిటి? నిరుపేదలకు సాయపడటం.
కష్టాల్లో వున్న వాళ్ళని ఆదుకోవడం. కావల్సిన వారికి చేయూతనివ్వటం.
సేవ చేయటానికి వాళ్ళు మనకో సదవకాశం కల్పిస్తున్నారని గుర్తుంచుకోండి.
అందుకనే సేవ చేయించుకున్న వాళ్ళకి మనం ఋణపడి వుండాలి.
ఏ మాత్రం ప్రతిఫలాన్ని ఆశించకుండా, నిస్వార్థంగా సహాయపడాలి.
అప్పుడే అది నిజమైన సేవ. వాళ్ళకేదో మనం ఎరగ పెడుతున్నామనుకొన్నారో,
అది సేవ కాదు. స్వార్థంతో ప్రతిఫలాన్ని ఆశించి చేసిన పని అవుతుంది.
ఎవరైనా మనల్ని తిట్టినా, అవమానించినా,
మన కష్టాలకి మూలకారకులయినా కోపం తెచ్చుకోకూడదు.
అలానే, ముప్పుతిప్పలు పెట్టినా కోప్పడకండి. పైపెచ్చు సాష్టాంగ నమస్కారం చేయండి.
ఎందుకో తెలుసా!
మన సంస్కారాలు తుడిచిపెట్టుకు పోవటానికి అతను దోహదం చేశాడు కాబట్టి.
ఇదే జీసస్ బోధించాడు. ఎవరైనా కుడి చెంపపై కొడితే, ఎడమ చెంపపై కూడా కొట్టించు కోమని చెప్పాడు అని బాబా పేర్కొన్నారు. బాబా పర్యవేక్షణలో, శిక్షణలో మండలి వారు నిస్వార్థ సేవలో నిష్ణాతులయ్యారు.

***

**ఇందుకు చక్కటి ఉదాహరణ కాశీనాధుని కథ.**
హరిజనుడు కాశీ. తీవ్ర రోగంతో మెలితిరిగి పోతున్న దశలో, మెహెరాబాద్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అవేళ జనవరి 7వ తేదీ. కాశీది దేవలగోన్ గ్రామం.
ఆ రాత్రి బాబా కాశీ పక్కనే కూర్చున్నారు. కాశీ తల్లిదండ్రుల్ని పిలిచి ధైర్యం చెప్పారు.
"నేను సముద్రంవంటివాడిని. నీటిపై బుడగల వంటివి ప్రాణులు.
బుడగలు ఏమవుతాయి? పగిలి పోతాయి కాస్సేపటిలో,
పగిలిపోయి సముద్రంలో కలిసిపోతాయి.
ఎవరు చనిపోయినా అంతే. నాలో లీనమైపోతారు", అన్నారు.
బుద్బుదప్రాయమైన మానవ ప్రాణం గురించి

బాబా చేసిన తాత్విక ఉపదేశం వాళ్ళకి అర్థమైందో లేదో తెలీదుకాని,
పిల్లాడి పరిస్థితి వాళ్ళని బెంబేలు పెట్టింది.
'భయపడకండి. కాశీ కోలుకుంటాడు' అని బాబా అభయం పలికారు.
ఐనా, వాళ్ళ ఆదుర్దా వాళ్ళది. కాశీ కోలుకొనే వరకూ
బాబా రోజూ ఆస్పత్రికి వచ్చేవారు.
మండలివారి నౌకరిని నగర్‌కి పంపి, ఐస్ తెప్పించారు.
కుర్రాడి నుదుట ఐస్ పెట్టమన్నారు.
డాక్టరు కరక్కాల్ చికిత్స చేస్తున్నాడు కాశీకి. అతనూ ఆశలు వదులకున్నాడు.
బాబాపై భారం మోపి, ఆయన చెప్పిన ప్రకారం చికిత్స చేయసాగాడు.
బాబా ఆజ్ఞ మేరకి, పాద్రి, పెండూ, కాశీని కంటికి రెప్పలా చూసుకొన్నారు.
కాశీ నెమ్మదిగా కోలుకున్నాడు. మెహెరాబాద్‌లో ఆనందం వెల్లివిరిసింది.
కరక్కాల్‌కి వెండి కప్పుని బహూకరించారు బాబా.
పాద్రి, పెండూలని శాలువలతో సత్కరించారు.
అందరికి మిఠాయి పంచిపెట్టారు ఆవేళ.

# శ్రీ గోరు ప్రసాద్ బాబాలో ఐక్యమయ్యారు



శ్రీ గోరు మెహెర్ ప్రసాద్, రాజాం 2026 జనవరి 22న బాబాలో ఐక్యమయ్యారు. ఆ సమయంలో వీరి తల్లితండ్రులు శ్రీ గోరు మోహనరావు, శ్రీమతి శోభ మెహెరాబాద్‌లో వున్నారు. ఈ వార్త తెలుసుకుని హుటాహుటిన రాజాంకు బయల్దేరారు. శ్రీ మెహెర్ ప్రసాద్ కొన్నాళ్ళపాటు రాజాం మెహెర్‌బాబా కేంద్ర కార్యదర్శిగా పనిచేశారు. బాబా సాహిత్యం క్షుణ్ణంగా చదివిన శ్రీ ప్రసాద్, బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. మెహెరాబాద్‌లో స్థిరపడేందుకై ఆంధ్రా రెస్ట్ హౌస్ ప్రక్కన సొంత ఇంటిని కూడా నిర్మించుకున్నారు. వీరి సంస్మరణార్థం రాజాంలో ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఫిబ్రవరి 2న ఏర్పాటు చేశారు. స్థానిక బాబా ప్రేమికులు పలువురు హాజరయ్యారు. శ్రీ ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని కొన్ని నిముషాలు మౌనం పాటించినట్లు తెలిపారు.

***

## ట్రస్టు చైర్మన్ అవిష్కరణ
# బాబా పాటలతో పెన్‌డ్రైవ్



అవతార్ మెహెర్‌బాబా ఆంధ్ర సెంటర్ తరఫున బాబావారి పాటలు, ప్రార్థనలు, నామ స్మరణతో రూపొందించిన పెన్‌డ్రైవ్‌ను ట్రస్టు చైర్మన్ శ్రీ ఫలూ మిస్త్రీ 57వ అమరతిథి వేడుకలలో అవిష్కరించారు.

ఈ పెన్ డ్రైవ్‌లను తెలుగునాటగల అన్ని బాబా కేంద్రాలకు ఉచితంగా అందజేస్తున్నట్లు ఆంధ్ర సెంటర్ కార్యదర్శి శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా (92472 45848) ఒక ప్రకటనలో తెలిపారు. పెన్‌డ్రైవ్ పొందగోరువారు తమ విజ్ఞప్తిని కేరాఫ్ శ్రీ కన్యకా పరమేశ్వరి రైస్ మిల్, గొడుగుపేట, మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు పంపవల్సిందిగా కోరుతు న్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 92472 45848ను సంప్రదించగలరు.



ధుని ప్రజ్వలన సమయం

## తాడేపల్లిగూడెం రామారావుపేట

బాబావారి 57వ అమరతిథి వైభవంగా జరిగింది. ఉదయం 8.45 శ్రీ యం. రామారావు శ్రీమతి వీరలక్ష్మి ధుని వెలిగించారు. స్థానికులు సుమారు 200 మంది ప్రేమికులు పాల్గొన్నారు. బాబా జీవితవిశేషాలు, సందేశాలపై డాక్టర్ విజయ సారధి హృద్యంగా ప్రసంగించారు. మ. 12 నుండి 12.15 వరకూ మౌనంలో బాబా నామస్మరణ, ప్రార్థనలు నిర్వహించి నట్లు తెలిపారు. అనంతరం ఆరతి, ప్రేమ ప్రసాద వితరణ జరిగిందని డాక్టర్ విజయసారధి తెలిపారు.




# క్రొత్త పుస్తకం - దేవుని సోదరి
# మణిజా ఆత్మకథ

**పాశ్చాత్య బాబా ప్రేమికురాలు, మెహెరాబాద్** నివాసి శ్రీమతి హెడర్ నాడెల్, మణిజాకు వ్యక్తిగత సహాయకురాలిగా చాలాకాలం పనిచేసింది. మణితో తన అనుభవాలన్నింటినీ క్రోడీకరించి నేటి తరానికి తెలియజేసేలా ఇంగ్లీషులో **'జాయిస్ పాత్'** పేరిట రెండు సంపుటాలను ఆమె ప్రచురించింది. కాగా ఈ పుస్తకాన్ని శ్రీమతి యస్.యస్. లక్ష్మి, కాకినాడ తెలుగులో అనువదించగా, శ్రీ పి.వి.యస్.ఎన్. శర్మ, తణుకు బాబా కేంద్రం తరఫున ప్రచురించారు. **మణిజా 1918 డిసెంబరు 15న జన్మించింది.** అప్పటికే భగవదనుభవం పొందిన మేర్వాన్‌కి 24 సంవత్సరాల వయస్సు. ఈ వార్త తెలుసుకుని పురిటికందుని తన చేతుల్లోకి తీసుకుని ప్రేమగా తన గుండెలకు హత్తుకున్నాడు మేర్వాన్. ఆ మాదిరిగా, ఆ దైవీ మానవుని అక్కున చేరింది నవజాత మణిజా శిశువుగానే. వారిది అనేక జన్మల బంధం. బాబా మణిజాని 'ప్రేమాన్విత సోదరి' అని ప్రశంసించారు. ఆమెకు ఏ పని అప్పగించినా హృదయ పూర్వకంగా నెరవేరుస్తుందనేవారు బాబా.

**బాబా ప్రేమికులందరికీ మార్గనిర్దేశం చేసేలా ఆమె నిస్వార్థ సేవా జీవితం గడిపింది.** ఇతరులకు సేవ చేసేందుకే ఆమె ఎక్కువగా జీవించింది. బాబా కోరుకున్న జీవితాన్ని ఆమె గడిపింది. క్రమశిక్షణతో గడిపిన ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శం. 1996 ఆగస్టు 19న ఆమె తుదిశ్వాస విడిచింది. మెహెరాబాద్‌లోని స్మశాన వాటికలో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ఏరుచ్ తన దగ్గర ఎంతోకాలంగా బధ్రపరచిన గంధపు చెక్కను ఆ రోజు మణిజా తల క్రింద వుంచి వీడ్కోలు పలికారని ఈ గ్రంథంలో తెలియజేశారు. **ఇలా 192 పేజీలు గల ఈ పుస్తకంలో అనేక అరుదైన విషయాలు తెలియజేశారు. ప్రతిఒక్కరూ చదవవల్సినది, ప్రతిఇంటా తప్పక ఉండవల్సినదీ గ్రంథం. పుస్తకం ఖరీదు రూ. 100/-.** ప్రతుల కోసం శ్రీ పివిఎస్ఎన్ శర్మ, డోర్ నంబరు 35-33-6, బొమ్మల వీధి, తణుకు, పగో జిల్లా. ఫోన్. 85007 06668 సంప్రదించగలరు.

***

## బాబా నాకు లడ్డూ ప్రసాదంగా ఇచ్చారు

# లక్ష్మణ్ పవార్



**మెహెరాబాద్ నివాసి, లక్ష్మణ్ పవార్ 1920వ దశకం నుండి** తమ తల్లితండ్రులు బాబావారి సేవలో వున్నామన్నాడు. బాబావారి ట్రస్టులో తమ తండ్రి ప్లంబర్‌గా పనిచేసేశాడన్నాడు. 1940వ దశకంలో ఒక సందర్భంలో మెహెరాబాద్‌లో బాబా దర్శనమిస్తుంటే, తన తండ్రి భుజాలపై కూర్చుని బాబా దర్శనం చేసుకున్నానని, బాబా తనకు ఒక పెద్ద లడ్డూ ప్రసాదంగా ఇచ్చారని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. తాను కూడా ప్లంబర్‌గా ట్రస్టులో పనిచేశానన్నాడు. ఎంపిఆర్ నిర్మాణ సమయంలో ప్లబింగ్ పనులన్నీ తానే చేశానని చెప్పాడు. **అమరతిథికి వెళ్ళిన మెహెర్‌బాబా పత్రికా బృందం తమ** తిరుగు ప్రయాణంలో తారసపడ్డాడు ఈ లక్షణ్ జీ పవార్. (ఫోన్. 98223 79346).

**మెహెరాబాద్‌లోని మెహెర్ దర్బార్‌కి ఎదురుగా వున్న హెచ్.పి. పెట్రోల్ బంకు సమీపంలో** నివాసముంటున్న పవార్, బాబా తనకు కావల్సినంత ఆనందం, తృప్తి ఇచ్చాడన్నాడు. తమ ఇద్దరి ఆడపిల్లలు అత్తారింటికి వెళ్ళారని, మగ పిల్లవాడు హైదరాబాద్‌లో గచ్చిబౌలీలోని ఐ.సి.ఐ.సి.ఐ.లో ఐటి హోదాలో పనిచేస్తున్నాడని గర్వంగా చెప్పాడు. **బాబా తమకు అన్నీ సమకూర్చాడని, తమకింకేమీ అక్కర్లేదని వినమ్రంగా రెండు చేతులూ జోడించాడు. బాబావారి కృపతో తమ జీవితం తృప్తిగా సాగుతోందన్నాడు.**

# గాజువాక కేంద్రం

“భుజావే నార్ జహతలనీ” ఆరతి బాబావారు రాసి నూరు సంవత్సరాలు నిండిన సందర్భంగా, ఆ ఆరతి విశిష్టతను, అమరతిథి విశేషాలు స్మరించుకుంటూ ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమాలు గాజువాక కేంద్రంలో నిర్వహించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వల్లూరి మెహెర్ ప్రసాద్ బాబావారిచ్చిన ఆరతిలోని భావార్థాన్ని తెలియజేశారు. గాజువాక సెంటర్ కార్యక్రమాలను యూట్యూబ్ ఛానల్‌లో వీక్షించవచ్చు.

# ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వరక్షకా!
నీవు ఆదియును
అంతమును లేనివాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములులేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ
నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ
పురుషుడవు,
సర్వోన్నతుడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మావు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
**నీవు 'ఈజద్' అనబడు**
**ఏకైక పూజ్యుడవు.**

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో,
మాటలలో
చేతలలో
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# మెహెరాబాద్ వేదికపై

## చిత్రమాలిక


శ్రీమతి పావని, విశాఖ


శ్రీమతి & శ్రీ బోసు బాబు, రమ


శ్రీమతి కె. పద్మావతి


మెహెర్ బృందావనం బృందం

## జీవిత సభ్యత్వం / అదనపు జీవిత సభ్యత్వం

### 2026 జనవరి / ఫిబ్రవరిలలో పంపిన వారి వివరాలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ కె. కుమారస్వామి విశాఖపట్నం | రూ. 1000/- |
| 2. | శ్రీ శ్యామసుందర్, విశాఖపట్నం - | రూ. 1000/- |
| 3. | శ్రీ వానపల్లి కామేశ్వరరావు, విశాకపట్నం | రూ. 1000/- |
| 4. | శ్రీ మోహన్‌దాస్ ధర్మవరం | రూ. 1000/- |
| 5. | శ్రీ మెహెర్ పునీత్, వరంగల్లు | రూ. 2000/- |
| 6. | శ్రీ డి. వెంకట్రావ్, విజయనగరం | రూ. 1000/- |
| 7. | శ్రీ బ్రహ్మానందం, జొన్నాడ, తూగోజి | రూ. 1000/- |
| 8. | రమణారెడ్డి కేరాఫ్ శ్రీ ఎల్లారెడ్డి, ఎల్లమ్మకుంట, సిరిసిల్లా | రూ. 1000/- |
| 9. | శ్రీ కొండలరావు విశాఖపట్నం | రూ. 1000/- |
| 10. | శ్రీ నిరంజన్ బాబు పిండి, హైదరాబాద్ | రూ. 1000/- |
| **11.** | **శ్రీ జాస్తి శరత్ బాబు, కొవ్వూరు** | రూ. 1000/- |
| **12.** | **శ్రీ జి.వి. సత్యనారాయణ, విజయనగరం** | రూ. 2000/- |
| 13. | శ్రీ యస్. సింహాద్రి, విజయనగరం | రూ. 1000/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**
**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**email: malladisukku@gmail.com**
**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
**ఫోన్: 99595-53218.**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**